STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 129 | ఎడిటర్ : అలీ ముర్తుజా | మంగళవారం 24 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

పార్లమెంట్ సమావేశాలపై
స్పష్టత ఇవ్వాలి



- శీతాకాల సెషన్ తేదీలు చెప్పాలన్న జైరాం రమేశ్
- ప్రోరోగ్ కాని వర్షాకాల సమావేశాలపై నిలదీత
- డీలిమిటేషన్ కోసమే మెజారిటీ యత్నాలని ఆరోపణ
- ముందుగా క్యాలెండర్ ప్రకటించాలన్న శశి థరూర్

4



4

నేపాల్‌కు రూ.24 వేల కోట్ల సాయం

ఫిరాయింపుల చట్టంపై కేంద్రం, ఈసీకి నోటీసులు

- పదో షెడ్యూల్‌లో సమగ్ర సంస్కరణలపై పిల్
- వ్యూహాత్మక రాజీనామాలతో అనర్హతకు ఎగనామం
- సమయబద్ధంగా నిర్ణయాలు కోరిన పిటిషనర్
- సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ



4

పాలనకు 'ఏఐ' వేగం.. సేవలకు
కొత్త రూపం

వైద్యం నుంచి వ్యవసాయం వరకు సాంకేతికత వినియోగం

డేటా ఆధారిత నిర్ణయాలతో పాలనలో మెరుగైన ఫలితాలు

- పబ్లిక్ గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం ఉండొద్దు
- రెవెన్యూ, లీగల్ ఏఐ స్టాక్‌తో శాఖల పనితీరుకు మరింత పదును
- ప్రభుత్వ పనితీరుకు స్థానిక సంస్థల ఎన్నికలే కొలమానం
- ఆర్టీజీఎస్ సమీక్షలో ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి, నవంబర్ 23 (సమయం న్యూస్): వైద్యారోగ్యం నుంచి వ్యవసాయం వరకు ప్రతి రంగంలోనూ కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆధునిక టెక్నాలజీ, ఏఐ స్టాక్ సాయంతో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేయడంతో పాటు శాఖల పనితీరును, ప్రభుత్వ ఆదాయాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) సమీక్షలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సోమవారం సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. పౌర సేవలను మరింత సమర్థంగా, వేగంగా అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం

మిగతా 2 లో



జస్టిస్ లిబర్హాన్ సేవలు

చిరస్మరణీయం

- రాజ్యాంగ, పరిపాలనా కేసుల్లో ఆయనది ప్రత్యేక ముద్ర
- ఏపీ హైకోర్టులో ఘనంగా సంస్మరణ సభ.. ఫుల్ కోర్టు నివాళులు
- ఆయన న్యాయప్రస్థానాన్ని స్మరించుకున్న సీజే జస్టిస్ లీసా గిల్

ప్రముఖ న్యాయమూర్తి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్. లిబర్హాన్ న్యాయరంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ కొనియాడారు. లిబర్హాన్ మృతికి సంతాపంగా సంస్మరణ సభ నిర్వహించారు.

వివరాలు 2లో..



సత్యసాయి సేవలు ప్రపంచానికే
ఆదర్శం

- బాబా బోధనలతో పేదల జీవితాల్లో మార్పు: కేరళ సీఎం సతీశన్
- చిన్నారుల గుండె ఆపరేషన్లకు కోల్ ఇండియా నిధులు: కిషన్‌రెడ్డి

3వ పేజీలో..

మందుల కొనుగోలులో కీలక మార్పు



ఇక ఆరు నెలలకు సరిపడా కొనుగోలు

జాప్యం నివారణకే కొత్త విధానం

రూ.275 కోట్లతో డిసెంబర్‌లోగా పూర్తి

గత ప్రభుత్వ తీరుపై మంత్రి ఆగ్రహం

.. వివరాలు 3లో



రూ.4,299 కోట్లతో భారీ రైల్వే ప్రాజెక్టు

బిక్కవోలు-దువ్వాడ 3, 4 లైన్లకు టెండర్లు

.. వివరాలు 3లో



మారిటైం గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్

ఆగ్నేయాసియా దేశాలతో శాశ్వత భాగస్వామ్యాలకు సిద్ధం

2

- రాష్ట్రంలో నాలుగు కొత్త పోర్టులు.. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ క్లస్టర్
- విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏఐ హబ్
- ఆసియాన్-ఇండియా మారిటైం కాంక్లేవ్‌లో మంత్రి నారా లోకేశ్

ఆలయాలను కాపాడండి..
ఏపీని రక్షించండి



- చంద్రబాబు పాలనలో ఆలయాల కూల్చివేత
- భక్తుల విశ్వాసాలపై దాడి సరికాదు
- సనాతన ధర్మంపై ప్రభుత్వ వైఖరేంటి?
- 'ఎక్స్' వేదికగా వైఎస్ జగన్ ధ్వజం

3



కృష్ణా జలాలపై తేలని పంచాయితీ

ఏపీ 19.. తెలంగాణ 21 టీఎంసీలకు పట్టు

2

పటిష్ఠ భద్రతతో స్థానిక ఎన్నికలు

సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక నిఘా

- కోడ్ ఉల్లంఘన, ప్రలోభాలపై ఉక్కుపాదం
- అధికారుల సమన్వయమే కీలకమన్న పునేఠా
- పంచాయతీ, యూఎల్‌బీలపై నేడు సమీక్ష

రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుత, పారదర్శక, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో సమన్వయం, అప్రమత్తత, నిష్పక్షపాత వైఖరి అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.



2

పటిష్ఠ భద్రతతో స్థానిక ఎన్నికలు

సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక నిఘా

కోడ్ ఉల్లంఘన, ప్రలోభాలపై ఉక్కుపాదం

అధికారుల సమన్వయమే కీలకమన్న పునేఠా

పంచాయతీ, యూఎల్‌బీలపై నేడు సమీక్ష

విజయవాడ, నవంబర్ 23 (సమయం న్యూస్) : రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుత, పారదర్శక, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో సమన్వయం, అప్రమత్తత, నిష్పక్షపాత వైఖరి అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. మూడు విడతల గ్రామ పంచాయతీ ఎన్నికలు, 23 పట్టణ స్థానిక సంస్థల (యూఎల్‌బీ) ఎన్నికల నేపథ్యంలో తొలి విడత ఏర్పాట్లపై మంగళవారం జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయన కీలక ఆదేశాలు జారీ చేయనున్నారు. ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని ఎస్ఈసీ దిశానిర్దేశం చేయనున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు, అవసరమైన చోట అదనపు పోలీసు బలగాలను మోహరించాలని సూచించనున్నారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా బందోబస్తు కట్టుదిట్టం చేయాలని స్పష్టం చేయనున్నారు.



కోడ్ ఉల్లంఘనలు, ప్రలోభాలపై ఉక్కుపాదం

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (కోడ్) కఠినంగా అమలు చేయాలని, ప్రచార నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించనున్నారు. అక్రమ మద్యం, నగదు పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలపై ప్రత్యేక నిఘా ఉంచి కట్టడి చేయాలని స్పష్టం చేయనున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించనున్నారు. అదేవిధంగా సిబ్బంది శిక్షణ, పోలింగ్ సామగ్రి పంపిణీ, రవాణా, పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్ల పురోగతిని సమీక్షించనున్నారు. జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసులు, ఎన్నికల పరిశీలకులు, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఎస్ఈసీ ఆదేశించనున్నారు.

మూడో విడత నామినేషన్ల జోరు

రెండు రోజుల్లో సర్పంచ్‌కు 16,505 దాఖలు

వార్డు సభ్యుల పదవులకు 60,420 నామినేషన్లు

విజయవాడ, నవంబర్ 23 (సమయం న్యూస్) : రాష్ట్రంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఈ నెల 21, 22 తేదీల్లో రెండు రోజుల పాటు సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. 25 జిల్లాల్లోని 214 మండలాల పరిధిలో 4,244 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ జారీ చేయగా, రెండు రోజుల్లో సర్పంచ్ పదవులకు మొత్తం 16,505, వార్డు సభ్యుల పదవులకు 60,420 నామినేషన్లు వచ్చినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. మొదటి రోజుతో పోలిస్తే రెండో రోజు అభ్యర్థుల నుంచి భారీ స్పందన కనిపించింది. సర్పంచ్ పదవులకు తొలి రోజు (21న) 4,929 నామినేషన్లు రాగా, రెండో రోజు (22న) ఏకంగా 11,576 దాఖలయ్యాయి. అదేవిధంగా వార్డు సభ్యుల పదవులకు మొదటి రోజు 13,611 నామినేషన్లు అందగా, రెండో రోజు ఆ సంఖ్య 46,809కి పెరిగింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప, శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నామినేషన్లు దాఖలయ్యాయి. పోలవరం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తిరుపతి జిల్లాల్లో మూడో విడతలో ఎన్నికలు నిర్వహించాల్సిన గ్రామ పంచాయతీలు లేవని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం సహా ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఎస్ఈసీ ఆదేశించింది.

26న తిరుమలకు సీఎం చంద్రబాబు

తిరుపతి, నవంబర్ 23 (సమయం న్యూస్) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 26న (గురువారం) తిరుపతి, తిరుమలలో పర్యటించనున్నారు. ముందుగా ఉదయం 7.50 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి, 8 గంటలకు అక్కడి గాడె రామయ్య సీతారావమ్మ ఎంపీయూపీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రం నంబర్ 53/3కు చేరుకుంటారు. ఉదయం 8 నుంచి 8.10 గంటల మధ్య తన ఓటు హక్కును వినియోగించుకుంటారు. అనంతరం 8.20 గంటలకు నివాసంలోని హెలిప్యాడ్‌కు చేరుకుని, 8.30 గంటలకు హెలికాప్టర్‌లో తిరుపతికి బయలుదేరుతారు. ఉదయం 10 గంటలకు తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల హెలిప్యాడ్‌కు చేరుకోగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు స్వాగతం పలకనున్నారు. 10.15 గంటలకు రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి, 10.45 గంటలకు గాయత్రి అతిథి గృహానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 11.05 గంటలకు బయలుదేరి 11.10 గంటలకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ఉ1కు చేరుకుని, మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీవారిని దర్శించుకుంటారు. దర్శనానంతరం 12.05 నుంచి 12.45 గంటల వరకు గాయత్రి అతిథి గృహంలో ఉంటారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో తిరుపతికి బయలుదేరి మధ్యాహ్నం 1.15 గంటలకు శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 1.30 గంటలకు హెలికాప్టర్‌లో తదుపరి పర్యటనకు బయలుదేరనున్నారు.

పాలనకు 'ఏఐ' వేగం.. సేవలకు కొత్త రూపం

(మొదటి పేజీ తరువాయి..)

చేశారు. ఇందుకు అనుగుణంగా ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించేందుకు విస్తృతంగా 'కెపాసిటీ బిల్డింగ్' కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడినప్పుడే మరింత మెరుగైన పాలన అందించేందుకు అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజల నుంచి అందే ఫిర్యాదులను ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎక్కడైనా పర్యవేక్షణ లోపాలుంటే సరిదిద్దుకోవాలని, ప్రతి శాఖ తన పనితీరును నిరంతరం సమీక్షించుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు.



భవిష్యత్తు అంతా డేటా ఆధారిత నిర్ణయాలదే..

రెవెన్యూ, లీగల్ ఏఐ స్టాక్ ద్వారా వివిధ అంశాలను లోతుగా విశ్లేషించి, అత్యుత్తమ పనితీరు సాధించేలా చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో 'డేటా డ్రివెన్ డెసిషన్ మేకింగ్' (డేటా ఆధారిత నిర్ణయాలు) అత్యంత కీలకంగా మారుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పనితీరుకు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు ఒక కొలమానంగా నిలిచాయని అభిప్రాయపడ్డారు. శాఖల ఉన్నతాధికారులు పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ, ఆర్థిక, మున్సిపల్, ఇంధన శాఖల ఉన్నతాధికారులతో పాటు ఆర్టీజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

మారిటైం గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్

- ఆగ్నేయాసియా దేశాలతో శాశ్వత భాగస్వామ్యాలకు సిద్ధం
- రాష్ట్రంలో నాలుగు కొత్త పోర్టులు.. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ క్లస్టర్
- విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏఐ హబ్
- ఆసియాన్ సప్లై చెయిన్లలో కీలక భాగస్వామిగా ఎదుగుతాం
- ఆసియాన్-ఇండియా మారిటైం కాంక్లేవ్‌లో మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, నవంబర్ 23 (సమయం న్యూస్) : మారిటైం రంగంలో ఆగ్నేయాసియా దేశాలతో శాశ్వత భాగస్వామ్యాలు కోరుకుంటున్నామని, సముద్ర అనుసంధానం, సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఏపీ సిద్ధంగా ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇండియా ఫౌండేషన్, కేంద్ర విదేశాంగ శాఖ ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన 'ఆసియాన్ఉఇండియా మారిటైం కాంక్లేవ్'లో కేంద్ర సహాయ మంత్రి పబిత్ర మార్గరీటాతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆగ్నేయాసియా దేశాలతో మనకు శతాబ్దాల వాణిజ్య బంధం ఉందని, 'కనెక్టివిటీఉకన్వర్జెన్స్ఉకోఆపరేషన్' థీమ్‌తో ఆ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. దేశ వాణిజ్యంలో 95 శాతం సరుకు రవాణా సముద్ర మార్గం ద్వారానే జరుగుతోందని, ప్రధాని మోదీ నేతృత్వంలో సాగరమాల, మారిటైం విజన్ 2030, 2047లతో పాటు రూ.70 వేల కోట్ల ప్యాకేజీ (రూ.25 వేల కోట్ల మారిటైం డెవలప్‌మెంట్ ఫండ్ సహా) ద్వారా కేంద్రం సముద్ర ఆర్థిక వ్యవస్థకు పెద్దపీట వేస్తోందన్నారు.

నాలుగు కొత్త పోర్టులు.. షిప్ బిల్డింగ్ క్లస్టర్

దేశంలోనే పొడవైన 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతమున్న ఏపీని సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మేజర్ మారిటైం, ఇండస్ట్రియల్ గేట్‌వేగా తీర్చిదిద్దుతున్నామని లోకేశ్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో విశాఖ పోర్టు 10 శాతం వృద్ధితో రికార్డు స్థాయిలో 91.17 మిలియన్ టన్నుల సరుకును నిర్వహించిందన్నారు. రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడల్లో నాలుగు కొత్త పోర్టుల నిర్మాణం జరుగుతోందని, దుగరాజపట్నంలో రూ.30 వేల కోట్లతో షిప్ బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. గత వారమే విశాఖలో పోర్టుల విస్తరణ, లాజిస్టిక్స్, నౌకల మరమ్మతులపై రూ.7,500 కోట్ల విలువైన ఐదు ఒప్పందాలు కుదిరాయని వెల్లడించారు.

ఏఐ, సెమీకండక్టర్ హబ్‌గా ఎదుగుదల

విశాఖలో గిగావాట్ స్థాయి ఏఐ హబ్, డేటా సెంటర్లు, మూడు అంతర్జాతీయ సముద్రగర్భ కేబుళ్ల కోసం గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించిందని, రుషికొండలో సిఫీ తొలి ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశామని లోకేశ్ చెప్పారు. పోర్టుల్లో ఏఐతో స్మార్ట్ సేవలను విస్తరిస్తున్నామన్నారు. శ్రీసిటీ, తిరుపతిలో ఎలక్ట్రానిక్స్ తయారీని బలోపేతం చేయడంతో పాటు విశాఖ సమీపంలోని తర్లువాడలో సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్ కేంద్రం పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. బలమైన పోర్టులు, డిజిటల్ మౌలిక సదుపాయాలతో ఆసియాన్ సప్లై చెయిన్లలో ఏపీ కీలక భాగస్వామిగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇండియా ఫౌండేషన్ అధ్యక్షుడు డా. రామ్ మాధవ్, భారత నావికాదళ ప్రధానాధికారి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, మాజీ ప్రధానాధికారి అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠీ, వివిధ దేశాల రాయబారులు, ఆసియాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



జస్టిస్ లిబర్హాన్ సేవలు చిరస్మరణీయం

రాజ్యాంగ, పరిపాలనా కేసుల్లో ఆయనది ప్రత్యేక ముద్ర

ఏపీ హైకోర్టులో ఘనంగా సంస్మరణ సభ.. ఫుల్ కోర్టు నివాళులు

ఆయన న్యాయప్రస్థానాన్ని స్మరించుకున్న సీజే జస్టిస్ లీసా గిల్



అమరావతి, నవంబర్ 23 (సమయం న్యూస్) : ప్రముఖ న్యాయమూర్తి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్. లిబర్హాన్ న్యాయరంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ కొనియాడారు. రాజ్యాంగ, పరిపాలనాపరమైన కేసుల విచారణలో ఆయన తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. జస్టిస్ లిబర్హాన్ మృతికి సంతాపంగా సోమవారం ఏపీ హైకోర్టు మొదటి కోర్టు హాలులో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుల్ కోర్టు న్యాయమూర్తులు ఒక నిమిషం మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులు వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ.. 1938 నవంబర్ 11న ప్రస్తుత చండీగఢ్ సమీపంలోని ఓ గ్రామంలో జన్మించిన లిబర్హాన్, అంబాలా, చండీగఢ్‌లలో విద్యాభ్యాసం పూర్తి చేశారని తెలిపారు. 1962లో న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించి, 1987 ఫిబ్రవరి 11న పంజాబ్ఉహర్యానా హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారని వివరించారు. 1997 జులై 7న మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన, 1998లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీపై వచ్చి 2000లో పదవీ విరమణ చేసే వరకు సేవలందించారని గుర్తుచేశారు.

బాబ్రీ మసీదు ఘటనపై 17 ఏళ్ల విచారణ

1992 డిసెంబర్ 6న అయోధ్యలో జరిగిన బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనపై విచారణ జరిపేందుకు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రభుత్వం 1992 డిసెంబర్ 16న జస్టిస్ లిబర్హాన్ అధ్యక్షతన ఏకసభ్య విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని జస్టిస్ లీసా గిల్ గుర్తుచేశారు. సుమారు 17 సంవత్సరాల పాటు విచారణ జరిపిన అనంతరం 2009లో ఆ కమిషన్ నివేదికను సమర్పించిందని తెలిపారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభునాథ్ వాసిరెడ్డి మాట్లాడుతూ జస్టిస్ లిబర్హాన్ న్యాయప్రస్థానాన్ని స్మరించుకున్నారు. న్యాయరంగానికి ఆయన చేసిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయని, ఆయన అనుసరించిన న్యాయమార్గం న్యాయవాదులకు ఆదర్శమని కొనియాడారు. సభలో హైకోర్టు ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. లక్ష్మీనారాయణ, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ బాలాజీ, బార్ కౌన్సిల్ ప్రతినిధులు, ప్రభుత్వ సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై తేలని పంచాయితీ

ఏపీ 19.. తెలంగాణ 21 టీఎంసీలకు పట్టు.. పూర్తిస్థాయి బోర్డు భేటీకి నిర్ణయం వాయిదా

డెల్టాకు చుక్క నీరివ్వలేమన్న తెలంగాణ..తమ వాటానే కోరామన్న ఏపీ ఈఎన్‌సీ

హైదరాబాద్, నవంబర్ 23 (సమయం న్యూస్): హైదరాబాద్ జలసౌధలో సమావేశమైన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే భేటీని ముగించింది. నీటి కేటాయింపులపై జరిగిన చర్చలో మొత్తం 19 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, ఫిబ్రవరి వరకు 21 టీఎంసీలు కావాలని తెలంగాణ పట్టుబట్టింది. ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పూర్తిస్థాయి బోర్డు సమావేశంలో మరోసారి చర్చించాలని కేఆర్ఎంబీ నిర్ణయించింది. భేటీలో పల్నాడు వాటర్ గ్రిడ్ అంశాన్ని తెలంగాణ ప్రస్తావించగా.. ఆ పనులను గ్రామీణ నీటి సరఫరా శాఖ చేస్తోందని, ఆ వివరాలు తమకు తెలియవని ఏపీ జలవనరుల శాఖ అధికారులు పేర్కొన్నారు.

డెల్టాకు చుక్క నీరివ్వలేం: రమేశ్‌బాబు

సమావేశం అనంతరం తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) రమేశ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. నాగార్జునసాగర్‌లో మొత్తం 45 టీఎంసీల నీరు ఉందని, వచ్చే జులై వరకు జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందులో 5 టీఎంసీలు ఆవిరయ్యే అవకాశం ఉండగా, జులై వరకు హైదరాబాద్ తాగునీటి కోసమే 15 టీఎంసీలు అవసరమవుతాయన్నారు. హైదరాబాద్ తాగునీరు పోను మిగిలిన 25 టీఎంసీలపై చర్చిద్దామని కోరామన్నారు. సాగర్ నీటిని తాగునీరు, కుడి, ఎడమ కాల్వల కోసమే వాడాలని, కృష్ణా డెల్టాకు చుక్క నీరు కూడా ఇచ్చే అవకాశం లేదని స్పష్టం చేసినట్లు చెప్పారు. ఏపీకి పులిచింతలలో 42 టీఎంసీల నీరు ఉందని, పట్టిసీమ నుంచి కూడా కృష్ణా డెల్టాకు నీరు అందుతోందని ఆయన గుర్తుచేశారు.

మా వాటానే అడుగుతున్నాం: నరసింహమూర్తి

కృష్ణా డెల్టాకు నీరు విడుదల చేయాలని తాము ఒత్తిడి చేసినట్లు ఏపీ ఈఎన్‌సీ నరసింహమూర్తి తెలిపారు. నీటి వాటాలో రాష్ట్రానికి రావాల్సిన హక్కులనే అడుగుతున్నామని, నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదలపై పది రోజుల క్రితమే బోర్డుకు లేఖలు రాశామని చెప్పారు. ఈ సమావేశంలో పల్నాడు వాటర్ గ్రిడ్ అంశం చర్చకు రాలేదని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఈ ఏడాది సెప్టెంబర్‌లోనూ కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలతో జరిగిన త్రిసభ్య కమిటీ భేటీ సాగర్, శ్రీశైలం నీటి పంపిణీ, ఎల్‌నినో ప్రభావం, తాగునీటి అవసరాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడిన విషయం తెలిసిందే.



సత్యసాయి సేవలు ప్రపంచానికే ఆదర్శం

- బాబా బోధనలతో పేదల జీవితాల్లో మార్పు: కేరళ సీఎం సతీశన్
- చిన్నారుల గుండె ఆపరేషన్లకు కోల్ ఇండియా నిధులు: కిషన్‌రెడ్డి
- పుట్టపర్తిలో వైభవంగా 101వ జయంతి.. స్వర్ణ రథోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. అలరించిన నృత్యాలు



అనంతపురం, నవంబర్ 23 (సమయం న్యూస్): భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని హిల్ వ్యూ స్టేడియంలో సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన కేరళ ముఖ్యమంత్రి సతీశన్ మాట్లాడుతూ.. సత్యసాయి బాబా బోధించిన ప్రేమ, కరుణ, నిస్వార్థ సేవా మార్గంలో నడుస్తూ పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే నిజమైన భక్తి అని కొనియాడారు. సత్యసాయి ట్రస్టు చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారుల ఉచిత శస్త్రచికిత్సలకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ ఇండియా ద్వారా పూర్తి ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. సత్యసాయి ట్రస్టు ఎంత మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు చేసినా ఆ ఖర్చును తమ మంత్రిత్వ శాఖ భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

వైభవంగా స్వర్ణ రథోత్సవం

వేడుకల్లో భాగంగా స్వర్ణ రథంపై సత్యసాయి విగ్రహాన్ని అత్యంత వైభవంగా ఊరేగించారు. విద్యార్థుల బ్రాస్ బ్యాండ్, చెక్కభజన, డప్పు వాయిద్యాలు, భారతీయ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేశవ్యాప్తంగా పర్యటించి జయంతి వేడుకలకు చేరుకున్న 'ప్రేమ ప్రవాహిని' రథాలను స్టేడియంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సత్యసాయి ప్రేమ, త్యాగం, మానవత్వానికి ప్రతిరూపమని అన్నారు. 'లవ్ ఆల్ఉసర్వ్ ఆల్' సందేశం ప్రపంచానికి ఆదర్శమని, సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే ఐదు మానవతా విలువలు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, తాగునీటి రంగాల్లో ట్రస్టు చేస్తున్న సేవలు అమోఘమని, పుట్టపర్తి, బెంగళూరులోని సత్యసాయి ఆసుపత్రులు పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యం ప్రపంచానికే ఆదర్శమని పేర్కొన్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో హిల్ వ్యూ స్టేడియం కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

రూ.4,299 కోట్లతో భారీ రైల్వే ప్రాజెక్టు

- బిక్కవోలుఉదువ్వాడ 3, 4 లైన్లకు టెండర్లు
- 151.08 కి.మీ. ట్రాక్.. 45 నెలల్లో పూర్తి లక్ష్యం
- తుని, అనకాపల్లి బైపాస్‌తో సామర్లకోట మీదుగా మార్గం
- విజయవాడఉవిశాఖ మెయిన్ లైన్‌లో తగ్గనున్న రద్దీ



విశాఖపట్నం, నవంబర్ 23 (సమయం న్యూస్): రాష్ట్రంలో మరో భారీ రైల్వే ప్రాజెక్టుకు దక్షిణ కోస్తా రైల్వే శ్రీకారం చుట్టింది. రూ.4,299 కోట్లకు పైగా వ్యయంతో బిక్కవోలుఉదువ్వాడ మధ్య 3, 4 బ్రాడ్‌గేజ్ లైన్ల నిర్మాణానికి ఈపీసీ కాంట్రాక్టు విధానంలో టెండర్లను ఆహ్వానించింది. మొత్తం 151.08 కిలోమీటర్ల పొడవున కొత్త రైల్వే ట్రాక్‌ల నిర్మాణాన్ని ప్రతిపాదించగా, 45 నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. బిక్కవోలుఉదువ్వాడను కలుపుతూ సామర్లకోట మీదుగా ఈ మార్గాన్ని మ్యాపింగ్ చేశారు. ప్రస్తుతం ఉన్న తుని, అనకాపల్లి స్టేషన్లను బైపాస్ చేస్తూ ఈ కొత్త రైల్వే లైన్ రూపుదిద్దుకోనుంది. చెన్నైఉకోల్‌కతా ప్రధాన మార్గంలో ప్రయాణికుల రైళ్లతో పాటు సరకు రవాణా గణనీయంగా పెరగడంతో రైళ్ల రాకపోకల ఒత్తిడి తీవ్రమైంది. ప్రస్తుతం ఉన్న రెండు ట్రాక్‌లు సరిపోని నేపథ్యంలో మూడు, నాలుగు లైన్ల నిర్మాణానికి నిర్ణయించారు. ఈ విస్తరణతో విజయవాడఉవిశాఖపట్నం మెయిన్ లైన్‌పై రద్దీ తగ్గడంతో పాటు సరకు రవాణా రైళ్లకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ఈ ప్రాజెక్టులో సివిల్, ఎలక్ట్రికల్, సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్ పనులతో పాటు విద్యుదీకరణ, కవచ్ భద్రతా వ్యవస్థ పనులు కూడా ఇమిడి ఉన్నాయి. ఈ కొత్త ట్రాక్‌లను అనకాపల్లిఉకొత్తవలస కొత్త బ్రాడ్‌గేజ్ లైన్‌కు అనుసంధానించనున్నారు. దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోని విజయవాడ, విశాఖపట్నం డివిజన్లలో ఇది కీలక పురోగతికి దోహదం చేయనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిసెంబర్ 23న ప్రీఉబిడ్ కాన్ఫరెన్స్ నిర్వహించనుండగా, 2027 ఫిబ్రవరి 15 వరకు టెండర్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. నాలుగు సంస్థలతో కూడిన కన్సార్టియం కూడా ఈ పనులకు ఏకమొత్తంగా టెండర్ దాఖలు చేసుకునే వెసులుబాటు ఇచ్చారు.

తిరుపతిలో ఏఐఐఏకు ఏపీ గట్టి పోటీ

- రూ.350 కోట్ల సాయం, 60 ఎకరాల భూమికి హామీ
- 24 రాష్ట్రాల మధ్య 'ఛాలెంజ్' పద్ధతిలో ఎంపిక
- ఢిల్లీలో ప్రతిపాదన సమర్పించిన వీరపాండియన్
- శేషాచలం జీవవైవిధ్యం, రవాణా వసతులే బలం



అమరావతి, నవంబర్ 23 (సమయం న్యూస్): తిరుపతిలో అఖిల భారత ఆయుర్వేద సంస్థ (ఏఐఐఏ) క్యాంపస్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి సమగ్ర ప్రతిపాదన సమర్పించింది. ఆయుర్వేద వైద్య విద్య, పరిశోధన, అధునాతన చికిత్సా సౌకర్యాలను బలోపేతం చేసేందుకు దేశవ్యాప్తంగా మూడు కొత్త ఏఐఐఏ క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్రం ఇటీవల ప్రకటించింది. వీటిని దక్కించుకోవడానికి ఏకంగా 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు పోటీ పడుతుండటంతో తుది కేటాయింపుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తరఫున వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండియన్ ఇటీవల ఢిల్లీలో రాష్ట్ర ప్రతిపాదనను, తిరుపతి అనుకూలతలను వివరిస్తూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

100 పాయింట్ల 'ఛాలెంజ్' పద్ధతిలో ఎంపిక

తీవ్ర పోటీని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ 100 పాయింట్ల 'ఛాలెంజ్ పద్ధతి' ద్వారా క్యాంపస్ ప్రదేశాలను ఎంపిక చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 50 నుంచి 100 ఎకరాల వివాదరహిత భూమిని ఉచితంగా ఇవ్వడం, రోడ్డు, రైలు, విమాన రవాణా అనుసంధానం, 10 మెగావాట్ల విద్యుత్, రోజుకు 1 మిలియన్ లీటర్ల (1 ఎంఎల్‌డీ) నీటి సరఫరా, మురుగునీటి పారుదల వంటి మౌలిక వసతులను ప్రమాణాలుగా నిర్దేశించింది. వీటితో పాటు నాణ్యమైన పాఠశాలలు, కళాశాలలు, ఆరోగ్య సంరక్షణ, సిబ్బంది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు, చుట్టుపక్కల జిల్లాల రోగులకు అందుబాటులో ఉండటం, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం, తాత్కాలిక క్యాంపస్ వసతులు, ఆయుర్వేద పరిశోధనఉ వైద్య పర్యాటక ప్రణాళికలకు నిర్దిష్ట మార్కులు కేటాయించింది. అన్ని రాష్ట్రాల ప్రజెంటేషన్లను సమీక్షించిన అనంతరం కేంద్రం తుది నిర్ణయం తీసుకోనుంది.

తిరుపతికే ఎందుకు? ఏపీ ఆఫర్ ఇదీ..

తిరుపతిలో ఏఐఐఏ ఏర్పాటుకు అపార వనరులు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి స్పష్టం చేసింది. ఈ సంస్థకు బేషరతుగా రూ.350 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమల సమీపంలో ఉండటం, వివిధ రాష్ట్రాలతో బలమైన రవాణా అనుసంధానం, ఇప్పటికే ఉన్న పరిశోధనా వ్యవస్థ, శేషాచలం కొండల్లోని సమృద్ధ జీవవైవిధ్యం తిరుపతికి ప్రధాన బలాలని పేర్కొంది. తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయ ప్రాంగణంలో టీటీడీకి చెందిన 60 ఎకరాల భూమిని ఈ ప్రాజెక్టు కోసం ప్రతిపాదించగా, ఆయుష్ మంత్రిత్వ శాఖ అనుమతి లభించిన వారం రోజుల్లోనే భూమిని అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. చెన్నైఉఅనంతపురం రహదారికి ఆనుకుని ఉన్న ఈ స్థలం ఎస్వీ యూనివర్సిటీకి 1.8 కి.మీ., రైల్వే స్టేషన్, బస్టాండ్‌కు 5 కి.మీ., విమానాశ్రయానికి 15 కి.మీ. దూరంలోనే ఉందని వివరించింది. 'ఏపీ సింగిల్ విండో డెస్క్' పోర్టల్ ద్వారా ఒకే దరఖాస్తుతో 21ఉ30 రోజుల్లోనే అన్ని అనుమతులు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చింది. రెండు సబ్‌స్టేషన్ల ద్వారా 10ఉ15 మెగావాట్ల నిరంతర విద్యుత్, రోజుకు 2 ఎంఎల్‌డీ శుద్ధి చేసిన నీరు, మురుగునీటి పారుదల, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను కల్పిస్తామని అంగీకరించింది. పనులు వేగంగా ప్రారంభించేందుకు ఎస్వీ ఆయుర్వేద కళాశాల (దానికి అనుబంధంగా ఉన్న 200 పడకల బోధనా ఆసుపత్రి సహా), వేద విశ్వవిద్యాలయంలోని ఐదు అంతస్తుల భవనాన్ని తాత్కాలిక ప్రాంగణాలుగా ప్రతిపాదించింది.

మందుల కొనుగోలులో కీలక మార్పు



- ఇక ఆరు నెలలకు సరిపడా కొనుగోలు
- జాప్యం నివారణకే కొత్త విధానం
- రూ.275 కోట్లతో డిసెంబర్‌లోగా పూర్తి
- గత ప్రభుత్వ తీరుపై మంత్రి ఆగ్రహం

అమరావతి, నవంబర్ 23 (సమయం న్యూస్): ప్రభుత్వ ఆసుపత్రులకు మందులు, సర్జికల్స్ సరఫరాలో జాప్యాన్ని నివారించేందుకు వైద్యారోగ్య శాఖ కొనుగోలు విధానంలో కీలక మార్పునకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న లోపాలు, వాటి దుష్పరిణామాలపై కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా) సమగ్ర నివేదిక ఆధారంగా వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ మార్పునకు ఆదేశించారు. మందుల కొనుగోలుపై సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం అమల్లో ఉన్న మూడు నెలల విధానానికి బదులుగా ఆరు నెలల డిమాండ్‌కు సరిపడా మందులు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఇందుకనుగుణంగా వచ్చే ఏడాది జనవరిఉజూన్ కాలానికి అవసరమైన మందులు, సర్జికల్స్ కొనుగోలు ప్రక్రియను ఏపీఎంఎస్ఐడీసీ ఈ నెల 10న ప్రారంభించింది. గతానికి భిన్నంగా తొలిసారి ముందస్తుగా చేపడుతున్న ఈ కొనుగోళ్లకు సుమారు రూ.275 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేయగా, డిసెంబర్ నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

కొత్త విధానం రూపకల్పన

మందుల కొనుగోలులో గత జగన్ ప్రభుత్వ నిర్వాకాలపై 2018ఉ22 కాలానికి సంబంధించిన కాగ్ నివేదికను లోతుగా పరిశీలించి, సమగ్ర నూతన విధానాన్ని రూపొందించాలని మంత్రి ఆదేశించడంతో వైద్యారోగ్య శాఖ ఆ ప్రక్రియను చేపట్టింది. మందులు, సర్జికల్స్ సరఫరాలో గత ప్రభుత్వ వైఫల్యాలపై సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. గురివింద గింజ సామెతలా మాజీ సీఎం ప్రస్తుత కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని ఆయన దుయ్యబట్టారు. ఆసుపత్రులకు అవసరమైన 600కు పైగా మందుల్లో గత ప్రభుత్వం కేవలం 1.50 శాతం మందులనే అవసరాలకు తగినట్లు సరఫరా చేసినట్లు కాగ్ వెల్లడించిందని గుర్తుచేశారు.

ఆలయాలను కాపాడండి.. ఏపీని రక్షించండి



- చంద్రబాబు పాలనలో ఆలయాల కూల్చివేత
- భక్తుల విశ్వాసాలపై దాడి సరికాదు
- సనాతన ధర్మంపై ప్రభుత్వ వైఖరేంటి?
- 'ఎక్స్' వేదికగా వైఎస్ జగన్ ధ్వజం

అమరావతి, నవంబర్ 23 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాల కూల్చివేతలపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో ఆలయాల విధ్వంసం కొనసాగుతోందని ఆరోపిస్తూ.. 'ఆలయాలను కాపాడండి.. ఆంధ్రప్రదేశ్‌ను రక్షించండి' అని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. అంజనేయపురంలో శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేయడం కోట్లాది మంది భక్తుల విశ్వాసాలపై దాడి చేయడమేనని జగన్ విమర్శించారు. గతంలో తిరుమలలో చారిత్రక వేయికాళ్ల మండపం ధ్వంసం, కృష్ణా పుష్కరాల సమయంలో విజయవాడలో 40 ఆలయాల కూల్చివేత, బద్వేలులోని కాశినాయన జ్యోతి క్షేత్రంలో కూల్చివేతలను ఆయన గుర్తుచేశారు. ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించకుండానే పవిత్ర ఆలయ కట్టడాలను తొలగిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ కోసం శ్రీవాణి ట్రస్టును ఏర్పాటు చేశామని జగన్ పేర్కొన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం చారిత్రక వారసత్వ కట్టడాలను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తోందని మండిపడ్డారు. సనాతన ధర్మ పరిరక్షణ గురించి మాట్లాడే ప్రభుత్వం ఆలయాల కూల్చివేతల విషయంలో అనుసరిస్తున్న వైఖరి ఏమిటని చంద్రబాబు ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు.

సూర్యఘర్ పనుల్లో వేగం పెంచండి

- డిసెంబర్ 15లోగా లక్ష్యాన్ని చేరాలి..
- ఇప్పటికే 1.58 లక్షల ఇళ్లలో ఏర్పాటు
- అధికారులు, వెండార్ల సమన్వయమే కీలకం..
- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి ఆదేశం

విజయవాడ, నవంబర్ 23 (సమయం న్యూస్): పీఎం సూర్యఘర్ పథకం అమలులో నిర్దేశించిన లక్ష్యాలను డిసెంబర్ 15లోగా పూర్తి చేసేందుకు అధికారులు, సోలార్ వెండార్లు సమన్వయంతో పనిచేయాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి ఆదేశించారు. కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం 8 జిల్లాల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఈఈ), సోలార్ వెండార్లతో పథకం పురోగతి, జిల్లాల వారీగా సాధించిన లక్ష్యాలు, మిగిలిన పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు సోలార్ విద్యుత్ సదుపాయాన్ని విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ సబ్సిడీ పథకంతో అనుసంధానంగా ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని 1,91,242 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 382.48 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, నవంబర్ 22 నాటికి 1,58,800 గృహాల్లో (317 మెగావాట్ల సామర్థ్యం) పనులు పూర్తయ్యాయని వివరించారు. మిగిలిన గృహాల్లోనూ వేగంగా సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని, రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. సోలార్ వెండార్లు అవసరమైన సదుపాయాలను సమకూర్చుకుని ఇన్‌స్టాలేషన్ పనులను వేగవంతం చేయాలని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ గడువులోగా లక్ష్యాన్ని చేరుకోవాలని పుల్లారెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని అర్హులైన గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని, దరఖాస్తు నుంచి సోలార్ వ్యవస్థ ఏర్పాటు వరకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. సోలార్ విద్యుత్ వినియోగంతో గృహ వినియోగదారులకు విద్యుత్ బిల్లుల భారం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు, సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, హెచ్ఆర్) టీవీఎస్ఎన్ మూర్తి, సీజీఎం (ప్రాజెక్ట్స్) కె. లింగమూర్తి, సీజీఎం (ఐపీసీ) విజయ్ కుమార్, 8 జిల్లాల అధికారులు, సోలార్ వెండార్లు పాల్గొన్నారు.



ఫిరాయింపుల చట్టంపై కేంద్రం, ఈసీకి నోటీసులు

పదో షెడ్యూల్‌లో సమగ్ర సంస్కరణలపై పిల్
వ్యూహాత్మక రాజీనామాలతో అనర్హతకు ఎగనామం
సమయబద్ధంగా నిర్ణయాలు కోరిన పిటిషనర్
సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ

న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్) : పార్టీ ఫిరాయింపుల చట్టం, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలతో పాటు ఎన్నికల సంఘానికి (ఈసీ) నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని విచారించింది. పిటిషనర్ ఎ. సేతు తరఫున న్యాయవాదులు ఆర్. సతీశ్ కుమార్, జతిన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు అనర్హత కేసులను తప్పించుకోవడానికి వ్యూహాత్మక రాజీనామాలు చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అనర్హత విచారణ పెండింగ్‌లో ఉన్నప్పుడు లేదా రాబోతున్న సమయంలో రాజీనామా చేసి పదో షెడ్యూల్ నిబంధనల నుంచి తప్పించుకుంటున్నారని, ఇది రాజకీయ పునర్‌వ్యవస్థీకరణలకు దారితీసి అసెంబ్లీల సంఖ్యాబలాన్ని మారుస్తోందని వివరించారు. అనర్హత కేసులు పెండింగ్‌లో ఉన్నప్పుడు రాజీనామా చేసినా ఆ కేసులు ముగియకూడదని పిటిషనర్ కోరారు. రాజీనామా స్వచ్ఛందంగా, నిజమైనదేనా అని స్పీకర్ లేదా ఛైర్మన్ ఆధారాలతో పరిశీలించి కారణాలతో కూడిన ఉత్తర్వు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజీనామాలు, అనర్హత కేసులపై సమయబద్ధంగా, పారదర్శకంగా, స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకునేలా సంస్కరణలు తేవాలని అభ్యర్థించారు.

బాహుబలిలా ప్రవర్తించొద్దు

జడ్జిలు పరిధి దాటొద్దన్న సుప్రీంకోర్టు
బిహార్ సెషన్స్ జడ్జి తీరుపై అసంతృప్తి
కోర్టు ధిక్కరణ ప్రక్రియపై కీలక వ్యాఖ్యలు
అవసరమైతే అకాడమీలో శిక్షణ తీసుకోవాలని చురక

న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్) : న్యాయమూర్తులు తమ అధికార పరిధిని దాటి వ్యవహరించకూడదని, చట్టాన్ని పూర్తిగా అర్థం చేసుకోకుండా అధికారాన్ని దూకుడుగా వినియోగించవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాన్ని పాటించలేదనే కారణంతో ఓ పోలీసు అధికారిని కోర్టు ధిక్కరణ దోషిగా నిర్ధారించి జరిమానా విధించిన బిహార్‌కు చెందిన ఓ సెషన్స్ కోర్టు న్యాయమూర్తిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బాహుబలి మాదిరిగా వ్యవహరించవద్దంటూ చురకలు అంటించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఈ కేసును విచారించింది. పోలీసు సూపరింటెండెంట్‌ను కోర్టుకు పిలిపించి, అదే రోజు ఆయన్ను దోషిగా నిర్ధారించడంపై అభ్యంతరం తెలిపింది. ఈ సందర్భంగా జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి మాట్లాడుతూ.. సదరు న్యాయమూర్తికి చట్టంపై ఉన్న అవగాహన తీవ్ర నిరాశ కలిగిస్తోందన్నారు. న్యాయం చేయాలనే ఉద్దేశం ఉన్నప్పటికీ న్యాయ ప్రక్రియ నిబంధనలు, పరిమితులను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 384, పాత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) సెక్షన్ 345 పరిధిని సరిగ్గా అర్థం చేసుకోవాలని సూచించారు. విచారణ సమయంలో కోర్టులో ఎవరినైనా కొట్టడం, న్యాయస్థానాన్ని దూషించడం లేదా ఆదేశించినా బయటకు వెళ్లడానికి నిరాకరించడం వంటి చర్యలనే కోర్టు సమక్షంలో జరిగిన నేరాలుగా పరిగణించవచ్చని వివరించారు. కోర్టు ఆదేశించినా పోలీసు అధికారి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం ఆ పరిధిలోకి రాదని, అలాంటి సందర్భాల్లో చట్టం నిర్దేశించిన ప్రత్యేక ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. న్యాయమూర్తిని బాహుబలిలా వ్యవహరించవద్దని చెప్పాలని పిటిషనర్ తరఫు న్యాయవాదికి సూచించిన ధర్మాసనం, అవసరమైతే న్యాయ అకాడమీలో మరింత శిక్షణ పొందాలని హితవు పలికింది.

యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి నాన్ బెయిలబుల్ వారెంట్

2018 పరువు నష్టం కేసులో ఎదురుదెబ్బ
ఆదేశాలు జారీ చేసిన ఢిల్లీ సాకేత్ కోర్టు
విచారణకు గైర్హాజరు కావడంపై ఆగ్రహం
డిసెంబర్ 3కు తదుపరి విచారణ వాయిదా

న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్) : ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీకి ఢిల్లీ కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. 2018 నాటి క్రిమినల్ పరువు నష్టం కేసులో ఆయనపై సాకేత్ కోర్టు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అనమ్ రయీస్ ఖాన్ సోమవారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. తదుపరి విచారణను డిసెంబర్ 3కు వాయిదా వేశారు. 2018 మే నెలలో ధ్రువ్ రాఠీ తన యూట్యూబ్ ఛానెల్‌లో 'బీజేపీ ఐటీ సెల్ పార్ట్ఉ2' పేరుతో ఓ వీడియోను విడుదల చేశారు. అందులో బీజేపీ ఐటీ సెల్ తనను అప్రతిష్ఠపాలు చేసేందుకు లంచం ఇవ్వడానికి ప్రయత్నించిందని బీజేపీ సోషల్ మీడియా మద్దతుదారు వికాస్ పాండే ఆరోపించినట్లు రాఠీ పేర్కొన్నారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేస్తూ వికాస్ పాండే 2018లోనే పరువు నష్టం కేసు దాఖలు చేశారు. అప్పట్లో వైరల్ అయిన ఆ వీడియోను నాటి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రీట్వీట్ చేయడంతో రాఠీతో పాటు ఆయనపైనా పాండే చర్యలు ప్రారంభించారు. ఈ కేసులో రాఠీకి 2019 జులైలో తొలిసారి సమన్లు అందాయి. అయితే ఆయన విదేశాల్లో (ఆస్ట్రియాలో) నివసిస్తుండటంతో సమన్ల అందజేతలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇటీవల అక్టోబర్ 17, 31 తేదీల్లో కోర్టు బెయిలబుల్ వారెంట్లు జారీ చేసినా ఆయన హాజరుకాలేదు. వారెంట్లు అమలు కాకపోవడంతో తాజాగా నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. కాగా, ఇటీవల ఢిల్లీలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన కార్యక్రమాల కోసం ధ్రువ్ భారత్‌కు వచ్చి వెళ్లారు.

నేపాల్‌కు భారత్ రూ.24 వేల కోట్ల సాయం

- ప్రధాని మోదీ, బాలేంద్ర షా కీలక భేటీ
- ఎనిమిది రంగాల్లో ఒప్పందాలపై సంతకాలు
- నేపాల్‌లో స్టార్టప్ ఇంక్యుబేటర్, ఐఐటీ హబ్
- అయోధ్య-జనక్‌పుర్ కొత్త రైలు ప్రారంభం



న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్) : నేపాల్‌లో అభివృద్ధి పనుల కోసం భారత్ రూ.24 వేల కోట్ల ఆర్థిక సాయం అందించనుంది. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా భారత్‌లో పర్యటిస్తున్న నేపాల్ ప్రధాని బాలేంద్ర షా సోమవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. భారత్‌ఉనేపాల్ భాగస్వామ్యంతో చేపట్టే వివిధ ప్రాజెక్టులపై చర్చించిన ఇరుదేశాల నేతలు, రైలు, రోడ్డు కనెక్టివిటీకి సంబంధించి పలు ఒప్పందాలు చేసుకున్నట్లు భేటీ అనంతరం సంయుక్తంగా ప్రకటించారు. నేపాల్‌లో స్టార్టప్ ఇంక్యుబేటర్, ఐఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని, ఝాపా ప్రాంతంలో గ్రీన్ ఆయిల్ స్టోరేజ్ టెర్మినల్ నిర్మిస్తామని మోదీ తెలిపారు. మోతిహరీ పైప్‌లైన్ ప్రాజెక్టుతో పాటు బన్బాసాలో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ఏర్పాటుకు ఒప్పందం కుదిరిందన్నారు. మహాకాళి నదిపై మోటరబుల్ వంతెన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ఆగస్టులో నేపాల్‌లో సంభవించిన భారీ వరదల్లో ప్రాణనష్టంపై మోదీ సంతాపం తెలిపారు. వరద బాధిత కుటుంబాలు కోలుకోవడానికి, భవిష్యత్తులో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచడానికి భారత సాయం దోహదపడుతుందన్నారు. భారత్‌ఉనేపాల్ బంధం కేవలం పొరుగు దేశాలకే పరిమితం కాదని, ఆత్మీయత, పరస్పర విశ్వాసంతో కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

ఎనిమిది కీలక ఒప్పందాలు

బాలేంద్ర షా పర్యటన సందర్భంగా ఇరుదేశాలు ఎనిమిది అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అంతరిక్ష సాంకేతికత, భద్రతా శిక్షణ, పౌర సేవల సామర్థ్య పెంపు, ఆరోగ్యం, సంప్రదాయ వైద్యం, పట్టణాభివృద్ధి, వ్యవసాయ రంగాల్లో పరస్పర సహకారానికి ఇవి మార్గం సుగమం చేయనున్నాయి. దక్షిణాసియా ఉపగ్రహ సేవల వినియోగం కోసం శాట్‌కామ్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ఇస్రో, నేపాల్ సమాచారఉప్రసార మంత్రిత్వ శాఖ మధ్య ఒప్పందం కుదిరింది. ఆరోగ్య సంరక్షణ, ఆయుర్వేదంఉసంప్రదాయ వైద్య విధానాల అభివృద్ధిపై రెండు వేర్వేరు ఒప్పందాలు జరిగాయి. సుస్థిర పట్టణాభివృద్ధికి సాంకేతిక సహకారం, పశుసంపద, మత్స్య సంపద అభివృద్ధిపైనా ఇరుదేశాలు సంతకాలు చేశాయి.

అయోధ్య-జనక్‌పుర్ మధ్య ఎక్స్‌ప్రెస్

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య కంటోన్మెంట్ నుంచి నేపాల్‌లోని జనక్‌పుర్ ధామ్ వరకు నడిచే 'సరియుఉ కమలా ఎక్స్‌ప్రెస్' వారపు రైలును ప్రధాని మోదీ, బాలేంద్ర షా సోమవారం సంయుక్తంగా ప్రారంభించారు. ఈ రైలు సేవతో ఇరుదేశాల్లోని రెండు ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాల మధ్య ప్రయాణం మరింత సులభతరం కానుంది. అయోధ్య, జనక్‌పుర్ మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక బంధాన్ని ఈ సర్వీసు మరింత బలోపేతం చేయనుంది

యువత మత్తుకు దూరంగా ఉండాలి: ప్రధాని

కష్టపడి చదివి దేశానికి గర్వకారణంగా నిలవాలి
గురువుల స్ఫూర్తితోనే వికసిత్ భారత్ సాకారం
2029 నాటికి డ్రగ్స్ రహిత భారత్ కేంద్రం లక్ష్యం
తెలంగాణలో 25 నుంచి 'నషాముక్త్ భారత్' ర్యాలీ



న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): దేశ యువత ఎలాంటి వ్యసనాలకు లోనుకాకుండా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. సిక్కుల మొదటి గురువు శ్రీ గురునానక్ దేవ్ జయంతి సందర్భంగా ఢిల్లీలోని లోక్ నివాస్‌లో సోమవారం నిర్వహించిన 'శబద్ కీర్తన' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశం, సంస్కృతి కోసం సర్వస్వం త్యాగం చేసే స్ఫూర్తికి యావత్ సిక్కు సంప్రదాయం మారుపేరుగా నిలిచిందని ప్రధాని కొనియాడారు. వందల ఏళ్ల వలసవాద పాలనలో దేశం కష్టాలు ఎదుర్కొన్నప్పుడు దేశ రక్షణ అనే జ్యోతిని మన గురువులు ఆరిపోకుండా సజీవంగా ఉంచారని గుర్తుచేశారు. ఆ గురువుల స్ఫూర్తి, ఆదర్శాలతోనే 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోగలమని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. నేడు సమాజంలో డ్రగ్స్ ఒక పెద్ద సవాలుగా మారిందని ప్రధాని పేర్కొన్నారు. దేశంలోని ప్రతి యువకుడు మత్తు నుంచి విముక్తి పొంది, కష్టపడి చదువుకుని ముందుకు సాగుతూ తమ కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. తద్వారా తమ కుటుంబాలకు, దేశానికి గర్వకారణంగా నిలవాలన్నారు. ఈ ప్రయత్నంలో కుటుంబాల పాత్ర అత్యంత కీలకమని, యువత మాదకద్రవ్యాల బారిన పడితే వారి జీవితంతో పాటు కుటుంబాల కలలు కూడా ఛిద్రమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం, గురుద్వారాలు, సామాజిక సంస్థలన్నీ కలిసికట్టుగా యువతకు సరైన దిశానిర్దేశం చేయగలవని మోదీ తెలిపారు.

'నషాముక్త్ భారత్' దిశగా అడుగులు

2029 నాటికి భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దాలని కేంద్రం సంకల్పించింది. ఇందులో భాగంగా 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' పేరుతో దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనుంది. రానున్న 100 ఆదివారాల్లో పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'నషాముక్త్ భారత్' ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీలో రాజకీయాలకు అతీతంగా నాయకులు, సినీ ప్రముఖులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.



అనర్హుల రేషన్ కార్డుల ఏరివేతకు రంగం సిద్ధం

ఉచిత రేషన్‌లో 13.2 శాతం మంది అనర్హులు
కారు, ఏసీ, సర్కారు ఉద్యోగులకూ లబ్ధి
పట్టణ ప్రాంతాల్లో 15.7 శాతంగా గుర్తింపు
ఈఉకేవైసీతో తొలగింపునకు కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్) : దేశవ్యాప్తంగా అనర్హుల రేషన్ కార్డుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) కింద పంపిణీ చేస్తున్న ఉచిత రేషన్‌లో భారీగా అనర్హులు ఉన్నట్లు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం నిర్వహించిన అధ్యయనంలో తేలింది. కారు, ఏసీ, ప్రభుత్వ ఉద్యోగం ఉన్నవారు సైతం ఉచిత రేషన్ ద్వారా లబ్ధి పొందుతున్నట్లు అధికారులు గుర్తించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 51,303 లబ్ధిదారుల కుటుంబాలపై కేంద్రం సమగ్ర సర్వే నిర్వహించింది. ఇందులో జాతీయ సగటున 13.2 శాతం మంది అనర్హులు ఉన్నట్లు వెల్లడవగా, పట్టణ ప్రాంతాల్లోని ప్రాధాన్యతా కుటుంబాల్లో ఈ సంఖ్య 15.7 శాతంగా బయటపడింది. రాష్ట్రాల వారీగా పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా 39.5 శాతం, త్రిపురలో 39.2 శాతం, తమిళనాడులో 38.7 శాతం, మేఘాలయలో 28.5 శాతం మంది అనర్హులు ఉన్నట్లు కనుగొన్నారు. సంపన్న వర్గాలు కూడా రేషన్ కార్డులు కలిగి ఉండటం వల్ల ప్రభుత్వ ఖజానాపై వేల కోట్ల రూపాయల భారం పడటంతో పాటు నిజమైన పేదలకు అన్యాయం జరుగుతోందని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు నివేదిక సమర్పించారు. ఈ నివేదిక నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈఉకేవైసీ ప్రక్రియను పూర్తి చేసి, అనర్హుల రేషన్ కార్డులను తొలగించే పనిని వేగవంతం చేయాలని కేంద్రం భావిస్తోంది

పార్లమెంట్ సమావేశాలపై స్పష్టత ఇవ్వాలి

- శీతాకాల సెషన్ తేదీలు చెప్పాలన్న జైరాం రమేశ్
- ప్రోరోగ్ కాని వర్షాకాల సమావేశాలపై నిలదీత
- డీలిమిటేషన్ కోసమే మెజారిటీ యత్నాలని ఆరోపణ
- ముందుగా క్యాలెండర్ ప్రకటించాలన్న శశి థరూర్



న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్) : పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి ఉంటే అవి ఎప్పుడు జరుగుతాయో స్పష్టం చేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ప్రోరోగ్ (ముగింపు ప్రకటన) కాని వర్షాకాల సమావేశాలను తిరిగి ప్రారంభించే ఆలోచన ఉంటే ఆ తేదీలనైనా వెల్లడించాలని ఆయన నిలదీశారు. వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 100 రోజులు గడిచిపోయాయని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లును ఆమోదించుకునేందుకు లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించడానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నారని జైరాం రమేశ్ ఆరోపించారు. పునర్విభజన విషయంలో వారి వద్ద ఏమైనా ప్రణాళిక ఉందా? ఉంటే అదేమిటో తెలుసుకునే హక్కు దేశ ప్రజలకు ఉందన్నారు. శీతాకాల సమావేశాలపై నెలకొన్న అనిశ్చితిని బట్టి రెండు విషయాలు స్పష్టమవుతున్నాయని.. ప్రధానిఉహోంమంత్రి ద్వయం గందరగోళంలో ఉండి తామే సృష్టించుకున్న మాటల గారడీ, ప్రగల్భాల వలలో చిక్కుకున్నారని లేదా ఏదో ప్రమాదకరమైన కుట్రకు ప్రణాళిక రచిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ 'జీటీఏ' (జ్ఞానేశ్ థెఫ్ట్ అరేంజర్స్) ద్వయం అసలు రూపం బయటపడిందని, వారి తీరుతో పార్లమెంట్ వ్యవస్థ ప్రతిష్ఠ మరింత దిగజారుతోందని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

ముందుగానే క్యాలెండర్ ప్రకటించాలి: శశి థరూర్

మరోవైపు, పార్లమెంట్ సమావేశాల తేదీలపై నెలకొన్న సస్పెన్స్‌పై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. అనేక పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశాలు తమ పార్లమెంట్ సమావేశాల క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటిస్తాయని ఆయన గుర్తుచేశారు. బ్రిటిష్ లేదా జర్మన్ ఎంపీలు దేశ వ్యవహారాలపై ఎప్పుడు చర్చించాలో ముందే తెలుసుకుని, ఏళ్ల ముందే తమ క్యాలెండర్‌ను కచ్చితత్వంతో ప్లాన్ చేసుకోగలరని పేర్కొన్నారు. అలాంటప్పుడు భారతీయ ఎంపీలు మాత్రమే ప్రభుత్వ ఇష్టాయిష్టాలకు, మారుతున్న రాజకీయ ప్రాధాన్యతలకు ఎందుకు లోబడి ఉండాలని శశి థరూర్ ప్రశ్నించారు.



ఆదాయం లేకపోవడం మాత్రమే పేదరికం కాదు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): పేదరికంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇల్లు, తాగునీరు, వైద్యం వంటి కనీస అవసరాలకు కూడా నోచుకోలేకపోవడం పేదరికం కిందకే వస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు లింక్డిన్‌లో సుదీర్ఘ పోస్టు రాసుకొచ్చారు. భారత్‌లో 50 కోట్ల మంది కటిక పేదరికాన్ని జయించారంటూ ప్రపంచబ్యాంక్ నివేదిక వెలువరించిన నేపథ్యంలో ఈ పోస్ట్ పెట్టారు. "డబ్బు లేకపోవడం ఒక్కటే పేదరికం కాదు. ఇల్లు, నీరు వంటి ప్రాథమిక అవసరాలు కూడా అందుబాటులో ఉండాలి. ఒక్క తీవ్రమైన అనారోగ్యం కుటుంబాన్ని కటిక పేదరికంలోకి నెట్టేస్తుంది" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దశాబ్దకాలంలో భారత్ పేదరికాన్ని అధిగమించిందని గుర్తు చేశారు. మోదీ సర్కారు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, చొరవతోనే ఇది సాధ్యమైందన్నారు. 2011-23లో దేశంలో దాదాపు 50 కోట్ల మంది పేదరికాన్ని జయించారంటూ ప్రపంచబ్యాంక్ నివేదిక ఇవ్వడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకొచ్చే పథకాలు.. చివరి వ్యక్తికి చేరే వరకు ప్రధాని మోదీ స్వయంగా పర్యవేక్షిస్తారని నిర్మలా పేర్కొన్నారు. అంత్యోదయ లక్ష్యంతో స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, ముద్ర రుణాలు వంటి పథకాలు లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇలానే.. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ సర్కారు పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా నాగాలాండ్‌లోని కిఫిరే జిల్లాలో చిరుధాన్యాల ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న లఖ్‌పతి దీదీ ఎస్థర్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుష్మితా ఘరాయ్ ముద్ర రుణంతో తమ కుటుంబ ప్రింటింగ్ వ్యాపారాన్ని తిరిగి నిలబెట్టుకున్న సంఘటనలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.

'పశ్చిమ్ బంగా'గా బెంగాల్ పేరు మార్పు

రాష్ట్ర మంత్రివర్గం కీలక ఆమోదం.. ఆంగ్లంలోనూ అదే పేరుకు ప్రతిపాదన

డిసెంబర్ 9న అసెంబ్లీలో తీర్మానం.. వెల్లడించిన సీఎం సువేందు అధికారి

కోల్‌కతా, నవంబర్ 23 (సమయం న్యూస్) : పశ్చిమ బెంగాల్ పేరును 'పశ్చిమ్ బంగా'గా మార్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కోల్‌కతాలో సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న 'వెస్ట్ బెంగాల్'కు బదులుగా ఆంగ్లంలోనూ 'పశ్చిమ్ బంగా' అనే పేరునే ఉపయోగించాలని ప్రభుత్వం ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. 1947లో దేశ విభజన నాటి బెంగాల్ విభజన చారిత్రక పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం పేర్కొన్నారు. బెంగాలీ భాషలో ఇప్పటికే 'పశ్చిమ్ బంగా' అనే పేరు వాడుకలో ఉందని, ఇకపై ఆంగ్లంలోనూ అదే పేరును వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. డిసెంబర్ 4 నుంచి 14 వరకు జరగనున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో భాగంగా డిసెంబర్ 9న ఈ మేరకు సభలో తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు సువేందు అధికారి ప్రకటించారు. అసెంబ్లీ ఆమోదం పొందిన అనంతరం ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని వివరించారు. కాగా, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరు అధికారికంగా మారాలంటే శాసనసభ అభిప్రాయాన్ని తీసుకున్న అనంతరం కేంద్రం పార్లమెంట్‌లో చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.

యూపీలో 130 సీట్లు కోరిన కాంగ్రెస్

ఎస్పీ నేతలకు జాబితా అందించిన హస్తం..

అమేథీ, రాయ్‌బరేలీలో అన్ని సీట్లకు పట్టు

అఖిలేశ్‌తో చర్చించాక ఎస్పీ తుది నిర్ణయం

నేడు మరోసారి భేటీ కానున్న ఇరుపక్షాలు

న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రతిపక్ష ఇండియా కూటమి భాగస్వాములైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) మధ్య సీట్ల పంపకాల చర్చలు వేగవంతమయ్యాయి. 2027 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమకు దాదాపు 130 స్థానాలు కేటాయించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. సోమవారం ఢిల్లీలోని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ నివాసంలో ఇరు పార్టీల నేతలు సమావేశమయ్యారు. సుమారు 15 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో తమకు కావాల్సిన నియోజకవర్గాల జాబితాను కాంగ్రెస్ నేతలు ఎస్పీ ప్రతినిధులకు అందించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కనీసం ఒక స్థానంలో పోటీ చేసేలా కాంగ్రెస్ ఈ జాబితాను రూపొందించింది. ముఖ్యంగా అమేథీ, రాయ్‌బరేలీ ప్రాంతాల్లోని అన్ని అసెంబ్లీ స్థానాలను తమకు కేటాయించాలని కోరినట్లు సమాచారం. అయితే కాంగ్రెస్ భారీ సంఖ్యలో స్థానాలను కోరడంతో సమావేశానికి హాజరైన ఎస్పీ నేతలు వెంటనే నిర్ణయం తీసుకోలేకపోయారని, ఈ జాబితాపై పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో చర్చించిన తర్వాత తదుపరి భేటీలో తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తామని తెలిపినట్లు సమాచారం. మంగళవారం ఇరుపక్షాలు మరోసారి చర్చలు జరపనున్నాయి. భేటీ తక్కువ సమయమే జరిగినా చర్చలు సానుకూలంగా సాగాయని ఇరు పార్టీల నేతలు వెల్లడించారు. రెండు మూడు రోజుల్లో పొత్తుపై తుది నిర్ణయం తీసుకుంటామని ఎస్పీ సీనియర్ నేత రామ్‌గోపాల్ యాదవ్ తెలిపారు. ఇరు పార్టీల మధ్య అవగాహన కుదురుతుందని, 2027 ఎన్నికల్లో కలిసి పోటీ చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ నేత ఆరాధనా మిశ్రా పేర్కొన్నారు.



బిస్లెరీ నీటి నాణ్యతపై దుమారం!

- పరీక్షల్లో నమూనాలు విఫలమయ్యాయంటూ ఎఫ్ఎస్ఎస్ఏఐ చర్యలు
- కంపెనీపై కేసు నమోదుకు అనుమతి మంజూరు
- 14 నెలల నాటి వ్యవహారమేనంటూ బిస్లెరీ వివరణ
- ఆరు నమూనాల్లో ఐదు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగానే ఉన్నాయని వెల్లడి



న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): దేశవ్యాప్తంగా ప్రముఖ ప్యాకేజ్డ్ తాగునీటి సంస్థ బిస్లెరీ నాణ్యతపై వివాదం చెలరేగింది. సంస్థకు చెందిన నీటి నమూనాలు నాణ్యతా పరీక్షల్లో విఫలమయ్యాయన్న అంశంపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) న్యాయపరమైన చర్యలకు అనుమతి మంజూరు చేసినట్లు వెల్లడైంది. దీంతో బిస్లెరీ నీటి భద్రతపై చర్చ మొదలైంది. అయితే ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వ్యవహారం కొత్తది కాదని, దాదాపు 14 నెలల క్రితం గోవాలోని తమ తయారీ కేంద్రంలో ఉత్పత్తి చేసిన ఒక బ్యాచ్‌కు సంబంధించినదని బిస్లెరీ ఇంటర్నేషనల్ స్పష్టం చేసింది. నీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని పేర్కొంది. బిస్లెరీ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2025 సెప్టెంబర్ 30న ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు గోవాలోని తయారీ కేంద్రం నుంచి ఆరు నీటి నమూనాలను సేకరించారు. వాటిలో ఐదు నమూనాలు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని కంపెనీ తెలిపింది. ఆరో నమూనాలో మాత్రం ప్రాథమిక పరీక్ష సందర్భంగా బ్రోమేట్ పరిమాణం లీటరుకు 12 మైక్రోగ్రాములుగా నమోదైంది. అనుమతించిన పరిమితి లీటరుకు 10 మైక్రోగ్రాములు కాగా, రెండు మైక్రోగ్రాములు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ అంశమే వివాదానికి కారణమైందని సంస్థ వివరించింది. ప్రాథమిక పరీక్ష ఫలితాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ 2025 నవంబర్‌లో అప్పీలు చేసినట్లు బిస్లెరీ తెలిపింది. అనంతరం నమూనాను రిఫరల్ ప్రయోగశాలకు పంపగా, బ్రోమేట్ స్థాయి నిర్దేశిత పరిమితిలోనే ఉన్నట్లు తేలిందని పేర్కొంది. అయితే ఆ పరీక్షలో పాలీన్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్ల ఉనికిని గుర్తించినట్లు నివేదిక వెల్లడించిందని వివరించింది. రెండు ప్రయోగశాలల ఫలితాల్లో వైరుధ్యాలు ఉండటంతో అదే తేదీన తయారైన, అదే బ్యాచ్‌కు చెందిన నీటిని ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పొందిన స్వతంత్ర ప్రయోగశాలలో మరోసారి పరీక్షించామని తెలిపింది. ఆ పరీక్షల్లో నీరు అన్ని భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు తేలిందని కంపెనీ పేర్కొంది. మరోవైపు, రెండు వేర్వేరు ప్రయోగశాలల పరీక్షల్లో నమూనా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదన్న కారణంతో బిస్లెరీపై న్యాయస్థానంలో కేసు నమోదు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు నవంబర్ 22న ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించినట్లు సమాచారం. ఈ పరిణామంతో పాత వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. అయితే స్వతంత్ర ప్రయోగశాల నివేదిక తమ వాదనకు బలం చేకూరుస్తోందని బిస్లెరీ చెబుతోంది. వినియోగదారులకు సురక్షితమైన తాగునీటిని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని బిస్లెరీ ఇంటర్నేషనల్ స్పష్టం చేసింది. తయారీ ప్రక్రియ నుంచి సరఫరా వరకు నాణ్యతా ప్రమాణాలను కఠినంగా పాటిస్తున్నామని, ఈ వ్యవహారాన్ని నియంత్రణ సంస్థతో కలిసి చట్టపరమైన ప్రక్రియ ద్వారా పరిష్కరించుకుంటామని పేర్కొంది. కాగా, కేసు నమోదుకు అనుమతి ఇవ్వడం అంటే కంపెనీ తప్పు రుజువైనట్లు కాదని, తుది నిర్ణయం న్యాయపరమైన విచారణపై ఆధారపడి ఉంటుందని గమనించాలి. ప్రయోగశాలల నివేదికల్లో తేడాల నేపథ్యంలో ఈ వివాదం ఎలాంటి మలుపు తిరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

గోద్రా రైలు దహనం కేసు

17 ఏళ్ల తర్వాత వైద్య కారణాలతో దోషికి బెయిల్ మంజూరు

జీవిత ఖైదు అనుభవిస్తున్న ఇర్ఫాన్ సిరాజ్ పడాకు ఊరట

న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): గోద్రా రైలు దహనం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్న ఇర్ఫాన్ సిరాజ్ పడాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తీవ్రమైన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో పాటు, ఇప్పటికే 17 ఏళ్లకు పైగా జైలులో గడిపిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని సర్వోన్నత న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. సోమవారం (నవంబర్ 23) జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇర్ఫాన్‌కు ఉన్న తీవ్రమైన గుండె సంబంధిత అనారోగ్య పరిస్థితిని గుజరాత్ ప్రభుత్వం కూడా వ్యతిరేకించకపోవడంతో, వైద్య కారణాలతో అతడి శిక్షను తాత్కాలికంగా నిలిపివేస్తూ బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం అంగీకరించింది. 2002 ఫిబ్రవరి 27న గుజరాత్‌లోని గోద్రా వద్ద సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలులోని ఎస్-6 బోగీలో మంటలు చెలరేగిన ఘటనలో అయోధ్య నుంచి తిరిగి వస్తున్న 58 మంది కరసేవకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అనంతరం గుజరాత్‌లో తీవ్ర మత ఘర్షణలు చెలరేగాయి. ఈ కేసును విచారించిన ప్రత్యేక న్యాయస్థానం 2011 మార్చిలో 31 మందిని దోషులుగా నిర్ధారిస్తూ.. వారిలో 11 మందికి మరణశిక్ష, మరో 20 మందికి జీవిత ఖైదు విధించింది. అయితే, 2017లో గుజరాత్ హైకోర్టు 11 మంది మరణశిక్షలను జీవిత ఖైదులుగా మారుస్తూ తీర్పునిచ్చింది. కాగా, ఈ కేసులో గతంలోనూ పలువురు దోషులకు సుప్రీంకోర్టు వివిధ కారణాలతో బెయిల్ మంజూరు చేసింది. 2022లో ఇద్దరికి, 2023 ఏప్రిల్‌లో మరో ఎనిమిది మంది దోషులకు బెయిల్ ఇవ్వగా, తాజాగా ఇర్ఫాన్ సిరాజ్ పడాకు వైద్య కారణాలతో బెయిల్ లభించింది.





ఆసియాలో మూడో మహాశక్తిగా భారత్!

రెండో అత్యంత సమర్థ నేతగా ప్రధాని మోదీ!

సిడ్నీ/న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): ఆసియా పవర్ ఇండెక్స్-2025లో 'ప్రధాన శక్తి' హోదాకు భారత్ చేరుకుందని ఆస్ట్రేలియా సంస్థ లోవీ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. ఆసియాలోనే మూడో శక్తిమంతమైన దేశంగా భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నట్లు తెలిపింది. ఈ నివేదిక ప్రకారం, ప్రధాని నరేంద్ర మోదీ రెండో అతి శక్తిమంతమైన నేతగా రికార్డు సృష్టించారు. పెరిగిన ప్రాంతీయ రక్షణ భాగస్వామ్యం, ఆగ్నేయాసియా దేశాలకు బ్రహ్మోస్ క్షిపణుల విక్రయాలు దేశ రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేశాయని లోవీ ఇన్‌స్టిట్యూట్ పేర్కొంది. అదే సమయంలో స్థిరమైన వాణిజ్య, పెట్టుబడి, ఆర్థిక సంబంధాలు భారత్‌ను మరింత ముందుకు నడిపించినట్లు విశ్లేషించింది. ఆసియా దేశాల శక్తి సామర్థ్యాలు, అంతర్జాతీయంగా చూపించే ప్రభావం ఆధారంగా వార్షిక ఆసియా పవర్ ఇండెక్స్‌ను నిర్ణయిస్తారు. ఆసియా పవర్ ఇండెక్స్-2025లో 40 పాయింట్ల స్కోరుతో ఉన్న భారత్, ఈ ఏడాదిలో మరో 0.5 పాయింట్లు మెరుగుపడి 40.5 పాయింట్లకు చేరింది. దీంతో 2018 తర్వాత చైనాతో భారత్‌కున్న అంతరం భారీగా తగ్గింది. 100 పాయింట్లకు గానూ అమెరికా 78.9 స్కోరుతో, చైనా 73.6 స్కోరుతో 2026 నాటికి ఆసియాలో అగ్రరాజ్యాలుగా కొనసాగుతున్నాయి. నాయకత్వ సామర్థ్యాల విషయానికొస్తే.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తర్వాత ఆసియాలో రెండో అత్యంత సమర్థమైన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ నిలిచారు.

రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు

'జ్వాలా ఎంకే-1' కౌంటర్ డ్రోన్ మిసైల్ పరీక్ష విజయవంతం!

సైనిక స్థావరాలు, కీలక రక్షణ ప్రాంతాల భద్రతకు ఉపయోగకరం

జైపూర్, నవంబర్ 23 (సమయం న్యూస్): రక్షణ రంగంలో స్వావలంబన దిశగా భారత్ మరో కీలక ముందడుగు వేసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన స్వయంప్రతిపత్తి కౌంటర్ డ్రోన్ సూక్ష్మ క్షిపణి వ్యవస్థ 'జ్వాలా ఎంకే-1'ను రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ రంగ సంస్థ ఐజీ డిఫెన్స్ వెల్లడించింది. ఆధునిక యుద్ధాల్లో శత్రు డ్రోన్ల నుంచి ఎదురవుతున్న ముప్పును సమర్థంగా ఎదుర్కొనే లక్ష్యంతో ఈ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపింది. నిఘా, గూఢచర్యం, దాడుల కోసం వినియోగించే డ్రోన్లను గుర్తించి, వాటిని అడ్డుకునేలా అత్యాధునిక సాంకేతికతను ఇందులో పొందుపరిచినట్లు పేర్కొంది. ఐజీ డిఫెన్స్ వివరాల ప్రకారం.. జ్వాలా ఎంకే-1 వ్యవస్థ 2 నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోని వైమానిక లక్ష్యాలను ఎదుర్కోగలదు. భూమికి 50 మీటర్ల నుంచి 5 వేల మీటర్ల ఎత్తులో ప్రయాణించే డ్రోన్లను ఛేదించే సామర్థ్యంతో దీనిని రూపొందించారు. ముఖ్యంగా చిన్నపాటి డ్రోన్లను గుర్తించి వాటి కదలికలను విశ్లేషించడం, అవసరమైన సమయంలో ప్రతిచర్యలు చేపట్టడం ఈ వ్యవస్థ ప్రత్యేకతగా సంస్థ పేర్కొంది. జ్వాలా ఎంకే-1లో 'గ్రిడ్' పేరుతో కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. వివిధ సెన్సార్ల నుంచి సమాచారాన్ని సేకరించి శత్రు డ్రోన్లను గుర్తించడం, వాటి స్వభావాన్ని విశ్లేషించడం, లక్ష్యాన్ని ఎదుర్కొనే చర్యలను సమన్వయం చేయడం ఈ సాంకేతికత ప్రధాన విధి. మిషన్ నిర్వహణ నుంచి నిర్ణయ ప్రక్రియ వరకు పలు కార్యకలాపాలను సమన్వయం చేసేలా దీనిని అభివృద్ధి చేసినట్లు సంస్థ తెలిపింది. మరోవైపు జ్వాలా ఎంకే-1ను నాలుగు చక్రాల డ్రైవ్ కలిగిన వాహనంపై అమర్చిన బహుళ క్షిపణి ప్రయోగ వ్యవస్థ ద్వారా ప్రయోగించేలా రూపొందించారు. దీంతో అవసరాన్ని బట్టి సరిహద్దు ప్రాంతాలు, సైనిక స్థావరాలు, ఇతర కీలక రక్షణ కేంద్రాలకు వేగంగా తరలించి మోహరించే అవకాశం ఉంటుంది. స్థిరమైన రక్షణ వ్యవస్థలతోపాటు సంచార రక్షణ అవసరాలకు కూడా ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనే దేశీయ సాంకేతికతకు ప్రాధాన్యం పెరిగింది. తక్కువ ఎత్తులో ప్రయాణించే చిన్న డ్రోన్లు సైతం కీలక సైనిక స్థావరాలకు ముప్పుగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జ్వాలా ఎంకే-1 వంటి కౌంటర్ డ్రోన్ వ్యవస్థలు రక్షణ రంగానికి ఉపయోగపడనున్నాయి. పోఖ్రాన్‌లో నిర్వహించిన పరీక్ష విజయవంతమైందని ఐజీ డిఫెన్స్ ప్రకటించడం దేశీయ రక్షణ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిలో మరో ముందడుగుగా నిలిచింది.





బ్లాక్ ఫ్రైడే ఆఫర్లతో సైబర్ వల

నకిలీ వెబ్‌సైట్లు, ఫిషింగ్ లింకులతో జాగ్రత్త

మోసపోతే వెంటనే 1930కు కాల్ చేయండి

టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 23 (సమయం న్యూస్) : బ్లాక్ ఫ్రైడే ఆన్‌లైన్ షాపింగ్ సేల్స్‌ను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ప్రజలను హెచ్చరించింది. భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు, ఫిషింగ్ లింకులు, మోసపూరిత ప్రకటనల ద్వారా వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటున్నారని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులపై భారీ తగ్గింపులు ఇస్తామంటూ నకిలీ షాపింగ్ వెబ్‌సైట్ల లింకులను వాట్సాప్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియా ద్వారా పంపుతున్నారని ఆమె పేర్కొన్నారు. వాటిపై క్లిక్ చేస్తే వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా, క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలు చోరీ అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. నకిలీ పేమెంట్ లింకులు, అనుమానాస్పద క్యూఆర్ కోడ్‌ల ద్వారా కూడా మోసాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

టీజీసీఎస్‌బీ సూచనలు ఇవే..

అధికారిక వెబ్‌సైట్లు, యాప్‌లలో మాత్రమే ఆన్‌లైన్ షాపింగ్ చేయాలి. చెల్లింపులకు ముందు వెబ్‌సైట్ యూఆర్ఎల్‌ను జాగ్రత్తగా పరిశీలించాలి. నమ్మశక్యం కాని భారీ డిస్కౌంట్లు, ఫ్లాష్ సేల్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఓటీపీ, యూపీఐ పిన్, సీవీవీ, బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ వెల్లడించకూడదు. తెలియని లింకులపై క్లిక్ చేయకూడదు. అనుమానాస్పద క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయకూడదు. ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజల కష్టార్జితాన్ని కొల్లగొట్టే అవకాశం ఉన్నందున ఆన్‌లైన్ కొనుగోళ్ల సమయంలో అప్రమత్తంగా ఉండాలని టీజీసీఎస్‌బీ సూచించింది.

మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయండి

ఆర్థిక సైబర్ మోసానికి గురైన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని టీజీసీఎస్‌బీ సూచించింది. సత్వరంగా ఫిర్యాదు చేయడం ద్వారా నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని తెలిపింది

వాట్సాప్ వెబ్‌తో హ్యాకింగ్ ముప్పు

పబ్లిక్, షేర్డ్ కంప్యూటర్లలో లాగిన్ కావొద్దు

వాడాక మాన్యువల్‌గా లాగ్‌అవుట్ తప్పనిసరి

తప్పనిసరైతే ఇంకాగ్నిటో మోడ్ వాడాలి

కేంద్ర సైబర్ విభాగం ఐ4సీ కీలక హెచ్చరిక

న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): పబ్లిక్ కంప్యూటర్లు లేదా ఇతరులు వాడే షేర్డ్ పరికరాల్లో వాట్సాప్ వెబ్ లాగిన్ చేస్తే సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసే ప్రమాదం ఉందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. వాట్సాప్ వెబ్ ఉపయోగించిన తర్వాత కేవలం బ్రౌజర్ విండో లేదా ట్యాబ్‌ను క్లోజ్ చేస్తే సరిపోదని, తప్పనిసరిగా మాన్యువల్‌గా లాగ్‌అవుట్ చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ పరిధిలోని సైబర్ క్రైమ్ విభాగం 'ఐ4సీ' కీలక అడ్వైజరీ జారీ చేసింది. వాట్సాప్ వెబ్‌లో లాగిన్ అయిన ఖాతాలను కేటుగాళ్లు అనధికారికంగా చేజిక్కించుకుని, వ్యక్తిగత సంభాషణలను చదవడంతో పాటు ఖాతాదారుడి పేరుతో ఇతరులకు సందేశాలు పంపే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

ఆర్థిక మోసాలు, ఫిషింగ్ దాడులకు ఆస్కారం

హ్యాకర్లు కాంటాక్ట్ లిస్టులు, గ్రూప్ చాట్‌లను యాక్సెస్ చేసి, ఖాతాదారుడి గుర్తింపును అడ్డుపెట్టుకుని ఆర్థిక మోసాలు, ఫిషింగ్ దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఐ4సీ పేర్కొంది. ఆఫీసు కంప్యూటర్లు, షేర్డ్ సిస్టమ్స్ లేదా ఇతరులకు అందుబాటులో ఉండే పరికరాలపై వాట్సాప్ వెబ్ వాడేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వాట్సాప్ వెబ్ ద్వారా అధికారిక, సున్నితమైన పనులు చేయరాదని.. ప్రభుత్వ, సంస్థాగత, ఆర్థిక, రహస్య సమాచారాన్ని కంప్యూటర్లలోని వాట్సాప్ వెబ్ ద్వారా పంపకపోవడమే శ్రేయస్కరమని తెలిపింది. వాడకం అనివార్యమైతే ఇంకాగ్నిటో లేదా ప్రైవేట్ బ్రౌజింగ్ మోడ్‌ను ఉపయోగించాలని సూచించింది. తెలియని లేదా పబ్లిక్ కంప్యూటర్లకు దూరంగా ఉండాలని, సైబర్ కేఫ్‌లు, పబ్లిక్ కియోస్క్‌లు, హోటల్ బిజినెస్ సెంటర్లలో వాట్సాప్ వెబ్‌లోకి లాగిన్ కావొద్దని ఐ4సీ స్పష్టం చేసింది. ఖాతాలో అనుమానాస్పద సందేశాలు, అసాధారణ ప్రత్యుత్తరాలు కనిపిస్తే తీవ్రంగా పరిగణించాలని తెలిపింది. వినియోగదారులు తమ పరికరాలు, ఆపరేటింగ్ సిస్టమ్‌లు, బ్రౌజర్లు, భద్రతా సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని, అనుమానాస్పద డౌన్‌లోడ్‌లు, తెలియని ఫైళ్లు, క్రాక్డ్ సాఫ్ట్‌వేర్‌లకు దూరంగా ఉండాలని హితవు పలికింది.

ఏంటీ ఐ4సీ?

ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) అనేది దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం. ఇది దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాలు, దర్యాప్తు సంస్థల మధ్య సైబర్ నేరాల విచారణలో సమన్వయకర్తగా పనిచేస్తుంది. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు సులభంగా ఫిర్యాదు చేసేందుకు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅ)తో పాటు 1930 టోల్‌ఉఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌ను నిర్వహిస్తోంది.





ఇంద్రకీలాద్రిపై వైభవంగా బిల్వార్చన

శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రదోష వేళ ఆకాశదీపం, సహస్ర లింగార్చన

వేదమంత్రాల నడుమ బిల్వదళాల సమర్పణ



ఇంద్రకీలాద్రి, నవంబర్ 23 (సమయం న్యూస్) : కార్తీక మాసం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం బిల్వార్చన ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. స్థానాచార్యులు వి. శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సాయంత్రం 3 గంటల నుంచే పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె. శీనానాయక్ ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ బిల్వదళాలను స్వామివారికి సమర్పించారు. ప్రదోషకాలంలో ఆకాశదీపం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, ఊయల సేవలను ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పి. రాఘవరాజు, పద్మావతి ఠాకూర్, ఎం. కళావతి, ఎస్. సరిత తదితరులు పాల్గొన్నారు.



కోడె దుర్గాప్రసాద్ కుమారుడి రిసెప్షన్‌కు లోకేశ్





- నూతన దంపతులను ఆశీర్వదించిన మంత్రి
- అన్వయ కన్వెన్షన్‌లో ఘనంగా వేడుక

హైదరాబాద్, నవంబర్ 23 (సమయం న్యూస్) : విశ్రాంత ఐపీఎస్ అధికారి కోడె దుర్గాప్రసాద్ కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. హైదరాబాద్‌లోని అన్వయ కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులు అనీశ్ వెంకటాద్రి, డాక్టర్ సుమాంజలిని ఆయన ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నైతిక విలువలతోనే న్యాయవ్యవస్థకు గౌరవం

కోర్టు బయటా వృత్తి ధర్మం పాటించాలి

ప్రజాదరణ, లాభాలు నైతికతను మించొద్దు

నిజాయితీతోనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): న్యాయవ్యవస్థ గౌరవం, విశ్వసనీయత న్యాయవాదుల ప్రవర్తన, నైతిక విలువలపైనే ఆధారపడి ఉంటాయని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. కోర్టు గదుల్లోనే కాకుండా బయట కూడా న్యాయవాదులు వృత్తిపరమైన నైతికతను పాటించాలని, ప్రజాదరణ, వాణిజ్య ప్రయోజనాలు నైతిక నియమాలను అధిగమించకూడదని ఆయన పేర్కొన్నారు. అభిప్రాయ భేదాలు, విమర్శలు సహజమే అయినప్పటికీ, వాటిని నిష్పక్షపాతంగా, సంయమనంతో, సంస్థాగత సమగ్రతకు భంగం కలగకుండా వ్యక్తం చేయాలని సీజేఐ సూచించారు. ఏదైనా ఫిర్యాదు వచ్చినప్పుడే గుర్తుచేసుకునే బాధ్యతగా కాకుండా.. బార్, బెంచ్, న్యాయ విద్య రంగంలోని వారి రోజువారీ నిర్ణయాల్లో వృత్తిపరమైన మనస్సాక్షి భాగంగా ఉండాలని తెలిపారు. నిరంతర నిజాయితీ, జవాబుదారీతనం ద్వారానే న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

బెంగాల్ ఎస్ఐఆర్ అప్పీళ్లకు మరిన్ని ట్రిబ్యునళ్లు

కలకత్తా హైకోర్టు సీజేతో సంప్రదించండి

ఓటర్ల తొలగింపు అప్పీళ్లకు తొలి ప్రాధాన్యం

కోల్‌కతాలో అనువైన భవనాలు గుర్తించండి

ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమయం న్యూస్): పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్‌పై దాఖలవుతున్న అప్పీళ్లను విచారించేందుకు మరిన్ని ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘాన్ని (ఈసీ) సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సంప్రదించి ఈ నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ ఎన్నికలు జరగనున్న అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఓటర్ల పేర్ల తొలగింపునకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపును సవాలు చేసే అప్పీళ్లు, పేర్ల చేర్పును సవాలు చేసే అప్పీళ్లుగా కేసులను రెండు విభాగాలుగా విభజించాలని ట్రిబ్యునళ్లకు సూచించింది. పేర్ల చేర్పును సవాలు చేసే అప్పీళ్లకు అంత అత్యవసరం లేదని, వాటిని తర్వాత విచారించవచ్చని పేర్కొంది. ముఖ్యంగా కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓటర్ల అప్పీళ్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపింది. అప్పీలేట్ ట్రిబ్యునళ్లను ప్రజలు సులభంగా చేరుకునేలా, పెండింగ్ అప్పీళ్లను త్వరగా పరిష్కరించేందుకు కోల్‌కతాలోని వివిధ ప్రాంతాల్లో అనువైన భవనాలను గుర్తించాలని ఈసీని ఆదేశించింది.





భారత్ చేతిలో థాయ్‌లాండ్ చిత్తు

భోపాల్: మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్లో భారత్ విజయాల హ్యాట్రిక్ కొట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 7-0తో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసింది. దీపిక హ్యాట్రిక్‌తో జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించింది. నాలుగో నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్‌ను నవ్‌నీత్ కౌర్ గోల్‌గా మలిచి భారత్‌ను ఆధిక్యంలో నిలిపింది. ఆపై దీపిక (10, 11వ నిమిషాలు) స్వల్ప వ్యవధిలో రెండుసార్లు బంతిని లక్ష్యానికి చేర్చడంతో స్కోరు 3-0గా మారింది. తర్వాత భారత్ జోరు మరింత పెరిగింది. మరో మూడు గోల్స్ ఖాతాలో చేరాయి. ఈ గోల్స్‌ను ముంతాజ్ ఖాన్ (28వ), సునెలితా టోపో (32వ), దీపిక (56వ) చేశారు. 56వ నిమిషంలోనే నవ్‌నీత్ కౌర్ పెనాల్టీ స్ట్రోక్‌ను సద్వినియోగం చేయడంతో భారత్ 7-0తో నిలిచింది. ఆ తర్వాత థాయ్‌లాండ్‌ను ఒక్క గోల్ కూడా కొట్టనీయకుండా మ్యాచ్‌ను ముగించింది. ఈ టోర్నీలో ఇప్పటికే మలేసియా, దక్షిణ కొరియాపై భారత్ గెలిచింది.



భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లో ఉద్రిక్తత

హర్షిత్ రాణాపై స్లెడ్జింగ్..

పాక్ ఆటగాళ్లతో తిలక్ వర్మ వాగ్వాదం!

దోహా, నవంబర్ 23 (సమయం న్యూస్): రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ వివాదానికి దారితీసింది. భారత బౌలర్ హర్షిత్ రాణాను పాకిస్థాన్ ఆటగాళ్లు కవ్వించడంతో మైదానంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సహచర ఆటగాడి పట్ల ప్రత్యర్థుల ప్రవర్తనపై భారత కెప్టెన్ తిలక్ వర్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీంతో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా అంపైర్లు జోక్యం చేసుకుని ఆటగాళ్లను శాంతింపజేశారు. భారత ఇన్నింగ్స్ 45వ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. మహమ్మద్ ఇమ్రాన్ రంధావా వేసిన రెండో బంతికి హర్షిత్ రాణా ఔటయ్యాడు. అప్పటికే భారత్ ఓటమి అంచున ఉండగా, పాకిస్థాన్ విజయానికి మరో వికెట్ మాత్రమే అవసరమైంది. హర్షిత్ పెవిలియన్‌కు వెళ్తున్న సమయంలో సూఫియాన్ ముకీమ్‌తోపాటు పలువురు పాక్ ఆటగాళ్లు అతడిని కవ్వించినట్లు కనిపించింది. దీంతో మరో ఎండ్‌లో ఉన్న తిలక్ వర్మ వెంటనే స్పందించి ప్రత్యర్థి ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగాడు. అంపైర్లు మధ్యలోకి వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అయితే ఈ వివాదానికి ముందు కూడా ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య మాటల యుద్ధం జరిగినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ బ్యాటింగ్ సమయంలో హర్షిత్ రాణా పలుమార్లు ప్రత్యర్థి ఆటగాళ్లను కవ్వించినట్లు సమాచారం. వికెట్లు తీసిన సందర్భాల్లోనూ వాగ్వాదం జరగడంతో అంపైర్లు జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హర్షిత్ ఔటైన తర్వాత పాక్ ఆటగాళ్లు అదే తరహాలో స్పందించినట్లు కనిపిస్తోంది. అయితే ఆటగాళ్లు అసభ్య పదజాలం ఉపయోగించారనే అంశంపై స్పష్టత లేదు. ఈ ఘటనపై మ్యాచ్ రిఫరీ ఏమైనా చర్యలు తీసుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. ఇక మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ ఏ జట్టు 49.2 ఓవర్లలో 313 పరుగులకు ఆలౌటైంది. హసన్ నవాజ్ 79, మాజ్ సదాఖత్ 59, ఫర్హాన్ యూసఫ్ 56 పరుగులతో రాణించారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, సూర్యాన్ష్ షెడ్గే, విప్రజ్ నిగమ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. 314 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 49.1 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది. తిలక్ వర్మ సెంచరీతో పోరాడగా, అభిషేక్ శర్మ 70, షాబాజ్ అహ్మద్ 56 పరుగులు సాధించారు. అయినప్పటికీ భారత్‌కు ఓటమి తప్పలేదు. పాకిస్థాన్ ఏ జట్టు 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ ఫలితం కంటే మైదానంలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య జరిగిన వాగ్వాదమే ఎక్కువ చర్చకు దారితీసింది.



భారత్ టెస్టు డ్రా!

వెల్లింగ్టన్ తొలి టెస్టులో న్యూజిలాండ్ పోరాటపటిమ

720 పరుగులు చేసినా గెలుపు దక్కలేదు..

- రెండో ఇన్నింగ్స్‌లో 239/5తో ఓటమిని తప్పించుకున్న కివీస్
- ఎనిమిది మంది బౌలర్లను ప్రయోగించిన టీమిండియా
- భారత బౌలర్ల ఖాతాలో 42 మెయిడిన్ ఓవర్లు
- 43 ఓవర్లపాటు క్రీజులో పాతుకుపోయిన మిచెల్, ఫిలిప్స్



వెల్లింగ్టన్, నవంబర్ 23 (సమయం న్యూస్): న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో భారీ స్కోరు సాధించినప్పటికీ భారత్‌కు విజయం దక్కలేదు. వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 368 పరుగులు చేయగా, భారత్ 720/9 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దీంతో 352 పరుగుల ఆధిక్యం సాధించిన టీమిండియా విజయంపై ఆశలు పెట్టుకుంది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ బ్యాటర్లు పట్టుదలగా ఆడి 239/5 స్కోరుతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించినప్పటికీ చివరి వరకు వికెట్లు పడగొట్టలేకపోయారు. ఈ మ్యాచ్‌లో భారత్ ఏకంగా ఎనిమిది మంది బౌలర్లను ఉపయోగించడం విశేషం. టెస్టు క్రికెట్ చరిత్రలో టీమిండియా ఒక ఇన్నింగ్స్‌లో ఎనిమిది మంది బౌలర్లను ప్రయోగించడం ఇది 28వసారి. గత ఆగస్టులో కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరిగిన టెస్టులోనూ భారత్ ఎనిమిది మంది బౌలర్లతో బౌలింగ్ చేయించింది. వరుసగా రెండు టెస్టుల్లో ఈ విధంగా బౌలర్లను ఉపయోగించడం భారత క్రికెట్ చరిత్రలో అరుదైన సందర్భంగా నిలిచింది. గతంలో 1963-64 ఇంగ్లండ్ సిరీస్‌తోపాటు 1952--53లో పాకిస్థాన్, వెస్టిండీస్‌లతో జరిగిన వరుస టెస్టుల్లో ఇలాంటి పరిస్థితి నమోదైంది. మరోవైపు భారత బౌలర్లు న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 42 మెయిడిన్ ఓవర్లు వేసి ప్రత్యేక గుర్తింపు సాధించారు. 2025-27 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చక్రంలో ఒక జట్టు ఇన్నింగ్స్‌లో నమోదైన అత్యధిక మెయిడిన్ ఓవర్లుగా ఇవి నిలిచాయి. చివరిసారిగా భారత్ ఒక ఇన్నింగ్స్‌లో 40కిపైగా మెయిడిన్ ఓవర్లు వేసింది 2015లో దక్షిణాఫ్రికాతో ఢిల్లీలో జరిగిన టెస్టులోనే. ఆ మ్యాచ్‌లో భారత బౌలర్లు ఏకంగా 89 మెయిడిన్ ఓవర్లు వేసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. న్యూజిలాండ్ బ్యాటర్లు డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ భారత విజయావకాశాలను దెబ్బతీశారు. ఆరో వికెట్‌కు వీరిద్దరూ 43 ఓవర్లపాటు క్రీజులో నిలిచి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. ఈ శతాబ్దంలో న్యూజిలాండ్ తరఫున ఆరో వికెట్ లేదా అంతకంటే దిగువ వికెట్‌కు నమోదైన సుదీర్ఘ భాగస్వామ్యాల్లో ఇది రెండో స్థానంలో నిలిచింది. 2014లో ఇదే మైదానంలో భారత్‌పై బ్రెండన్ మెకల్లమ్, బీజే వాట్లింగ్ 123 ఓవర్లపాటు బ్యాటింగ్ చేసి 352 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన రికార్డు ఇప్పటికీ అగ్రస్థానంలో ఉంది. ఇక నవంబర్ నెలలో నాలుగు టెస్టులు డ్రాగా ముగియడం మరో విశేషం. బంగ్లాదేశ్--వెస్టిండీస్, ఆఫ్ఘనిస్థాన్--జింబాబ్వే, పాకిస్థాన్--శ్రీలంక జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లతోపాటు భారత్--న్యూజిలాండ్ తొలి టెస్టు కూడా డ్రాగా ముగిసింది. 2011 తర్వాత ఒకే నెలలో నాలుగు టెస్టులు డ్రాగా ముగియడం ఇది మూడోసారి. గతంలో 2013 మార్చి, 2022 మార్చి నెలల్లో ఇలాంటి ఫలితాలు నమోదయ్యాయి. భారీ ఆధిక్యం సాధించినా ప్రత్యర్థి బ్యాటర్ల పట్టుదల ముందు భారత్ విజయం అందుకోలేకపోవడం ఈ మ్యాచ్‌లో ప్రధాన విశేషంగా నిలిచింది.

మా బ్యాటర్లు అద్భుతం



ఓడిపోయే మ్యాచ్‌ను డ్రా చేశారు

హెన్రీ నికోల్స్ ఆనందం!

వెల్లింగ్టన్, నవంబర్ 23 (సమయం న్యూస్): భారత్‌తో వెల్లింగ్టన్ వేదికగా జరిగిన తొలి టెస్టులో న్యూజిలాండ్ అద్భుతంగా పోరాడి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో అజేయంగా 175 పరుగులు చేసిన హెన్రీ నికోల్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన నికోల్స్.. ఐదు రోజుల ఆటను వెనక్కి తిరిగి చూసుకుంటే పిచ్ పరిస్థితులు మారుతూ వచ్చాయని, రెండు జట్లు తమ శక్తిమేరకు పోరాడాయని తెలిపారు. ముఖ్యంగా చివరి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై తమ బ్యాటర్లు చూపిన పట్టుదల ప్రశంసనీయమని పేర్కొన్నారు. డారిల్ మిచెల్ (49: 186 బంతుల్లో), గ్లెన్ ఫిలిప్స్ (26: 126 బంతుల్లో) 43 ఓవర్ల పాటు క్రీజ్‌లో పాతుకుపోవడంతో టీమిండియాకు విజయం దక్కలేదని గుర్తు చేశారు. తొలి ఇన్నింగ్స్ నుంచి మ్యాచ్ ముగిసే సమయానికి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, పిచ్‌లో మార్పులు వచ్చినప్పటికీ బ్యాటర్లకు కొన్ని సవాళ్లు ఎదురయ్యాయని నికోల్స్ వివరించారు. అలాంటి పరిస్థితుల్లోనూ వాటిని అధిగమిస్తూ ఆడటం జట్టుకు సంతృప్తినిచ్చిందని, ఒక దశలో కష్టాల్లో ఉన్న జట్టు చివరకు మ్యాచ్‌ను డ్రాగా ముగించుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ అద్భుతంగా ఆడి భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారని, ఆ ఇద్దరి వల్లే మ్యాచ్‌ను డ్రాగా ముగించుకోగలిగామని, జట్టులోని ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించారని నికోల్స్ పేర్కొన్నారు.

మరికొంత సేపు ఆడితే బాగుండేది..

క్రైస్ట్‌చర్చ్ పోరుపై ఆసక్తి:

టెస్టులో తొలి నాలుగు రోజుల పాటు ఎక్కువ సమయం మైదానంలోనే గడిపిన నికోల్స్‌ను శారీరక పరిస్థితి గురించి ప్రశ్నించగా.. తాను బాగానే ఉన్నానని చెప్పారు. ఐదు రోజుల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం వల్ల ఆటగాళ్లంతా అలసిపోయారని, చివరి రోజు మైదానంలోకి దిగకుండా ఉండటం తనకు కొంత వింతగా అనిపించిందని తెలిపారు. శరీరం నొప్పులతో ఉన్నప్పటికీ మరికొంత సేపు మైదానంలో ఉండి ఆడితే బాగుండేదని, ఈ మ్యాచ్ నిజంగా ఓపికకు పరీక్షగా నిలిచిందని పేర్కొన్నారు. బేసిన్ రిజర్వ్ మైదానంలో తనకు మంచి రికార్డు ఉందని, ఈ మైదానంపై తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, గతంలో మంచి ప్రదర్శనలు చేసిన మైదానానికి తిరిగి రావడం ఎప్పుడూ సంతోషాన్నిస్తుందని హెన్రీ నికోల్స్ అన్నారు. తొలి రోజు పిచ్ గతంలో మాదిరిగానే ఉంటుందని భావించామని, అయితే ఆట సాగుతున్న కొద్దీ పరిస్థితులు మారిపోయాయని, అయినప్పటికీ సవాళ్లను ఎదుర్కొంటూ జట్టు తగిన పరిష్కారాలు కనుగొనడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇక తదుపరి క్రైస్ట్‌చర్చ్ టెస్టు గురించి మాట్లాడుతూ.. అక్కడ సాధారణంగా పిచ్‌పై కొంత గడ్డి ఉండటంతో పాటు బౌలర్లకు వేగం, బౌన్స్ లభిస్తాయని, ఈసారి కూడా అలాంటి పిచ్ ఉంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి టెస్టు డ్రాగా ముగియడంతో చివరి మ్యాచ్ మరింత ఆసక్తికరంగా మారిందని, క్రైస్ట్‌చర్చ్‌లో ఉత్కంఠభరిత పోరు ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ టెస్టులో న్యూజిలాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 368 పరుగులు చేయగా, భారత్ 720/9 వద్ద డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 239/5 స్కోరు చేయడంతో మ్యాచ్ డ్రాగా ముగియగా, నికోల్స్ తొలి ఇన్నింగ్స్‌లో 175లి పరుగులతో పాటు రెండో ఇన్నింగ్స్‌లో కీలక 31 పరుగులు సాధించి జట్టు తరఫున కీలక పాత్ర పోషించారు.

హైదరాబాద్ మరో విజయం

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో హైదరాబాద్ రెండో విజయం అందుకుంది. బంతితో కెప్టెన్ సీవీ మిలింద్ (4/25), రక్షణ్ రెడ్డి (3/24), బ్యాట్‌తో కె. హిమతేజ (40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 77 సత్తా చాటడంతో ఆదివారం జరిగిన గ్రూప్-డీ మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో ఉత్తరాఖండ్‌పై విజయం సాదించింది. ఉత్తరాఖండ్ ఇచ్చిన 147 పరుగుల లక్ష్యాన్ని 15.3 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. అభిరథ్ (22) కూడా రాణించాడు. తొలుత ఉత్తరాఖండ్ 19.2 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. యువరాజ్ చౌదరి (59), అనీశ్ (43) రాణించారు. మిలింద్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. మంగళవారం జరిగే తమ తదుపరి మ్యాచ్ గుజరాత్‌తో హైదరాబాద్ తలపడనుంది.





మమితా బైజు వీడియో కలకలం

ఏఐతో ఇంత దారుణమా!

మమితా బైజు, ప్రదీప్ రంగనాథన్ పేరుతో అభ్యంతరకర వీడియో ప్రచారం

హైదరాబాద్, నవంబర్ 23 (సమయం న్యూస్): కృత్రిమ మేధ సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ దాని దుర్వినియోగం సినీ ప్రముఖులకు తీవ్ర సమస్యగా మారుతోంది. ఇప్పటికే పలువురు నటీమణులు డీప్‌ఫేక్ వీడియోలతో ఇబ్బందులు ఎదుర్కోగా, తాజాగా మలయాళ నటి మమితా బైజు, నటుడు ప్రదీప్ రంగనాథన్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న అభ్యంతరకర వీడియో వివాదానికి దారితీసింది. వీరిద్దరూ కలిసి నటించిన 'డ్యూడ్' సినిమాలోని ఓ భావోద్వేగ సన్నివేశాన్ని కృత్రిమ మేధ సాయంతో అసభ్యకరంగా మార్చి ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నటీనటుల అనుమతి లేకుండా వారి చిత్రాలను ఇలా దుర్వినియోగం చేయడంపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సినిమాలోని సాధారణ సన్నివేశాన్ని అసభ్యకరంగా చిత్రీకరించేలా మార్ఫింగ్ చేశారని సామాజిక మాధ్యమాల్లో పలువురు ఆరోపిస్తున్నారు. వినోదం పేరుతో వ్యక్తుల గౌరవానికి భంగం కలిగించే కృత్రిమ వీడియోలను సృష్టించడం అత్యంత అభ్యంతరకరమని విమర్శిస్తున్నారు. ఈ వీడియోను చూసిన ఓ కంటెంట్ సృష్టికర్త తీవ్ర భావోద్వేగానికి గురైనట్లు వెల్లడించడం కూడా చర్చనీయాంశమైంది. సాంకేతికతను సృజనాత్మకతకు ఉపయోగించాల్సింది పోయి ఇతరుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు వినియోగించడం ఎంతవరకు సమంజసమని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రచారంలో ఉన్న వీడియో మూలం, దాన్ని రూపొందించిన వ్యక్తుల వివరాలు స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది. గతంలోనూ రష్మిక మందన్నా, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ వంటి పలువురు సినీ తారల పేరుతో డీప్‌ఫేక్, మార్ఫింగ్ వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి. ఇప్పుడు మమితా బైజు, ప్రదీప్ రంగనాథన్ పేరుతో మరో వివాదం తెరపైకి రావడంతో సినీ పరిశ్రమలో ఆందోళన వ్యక్తమవుతోంది. కేవలం సెలబ్రిటీలే కాకుండా సామాన్య మహిళలు, యువతులు కూడా ఇలాంటి సాంకేతిక దుర్వినియోగానికి గురయ్యే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. అభ్యంతరకర వీడియోలను ఇతరులకు పంపకుండా సంబంధిత సామాజిక మాధ్యమ వేదికలకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

నాకు పెళ్లి చేసుకోవాలని ఉంది.. కానీ,



వ్యక్తిగత జీవితంలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉండేందుకు ఇష్టపడతానని ప్రముఖ నటి నిత్యా మేనన్ అన్నారు. ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తి జీవితానికి సంబంధించిన పలు విషయాలను వెల్లడించారు. 'నేను ఎల్లవేళలా ఒంటరిగా ప్రయాణం చేసేందుకు ఇష్ట పడతాను. నేను వివాహ బంధానికి వ్యతిరేకం అంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ, అందులో ఏమాత్రం నిజం లేదు. నాకు కూడా వివాహం చేసుకోవాలని ఉంది. కానీ, నాకు సరైన వ్యక్తి తారస పడాలి. అదేసమయంలో పెళ్ళి చేసుకోవాలని ఆరాటపడటం లేదు. నిజాయితీతో కూడిన బంధాన్ని కోరుకుంటున్నాను. ఆ బందం అలాంటిది కాకపోతే నేను పెళ్ళికి దూరంగా ఉంటాను. ఒక వ్యక్తి జీవితంలో పవిత్రంగా ఉండాలి. అహంకారంతో నడుచుకుంటే అలాంటి బంధం సరైనది కాదు. నా జీవితంలో నా ఎంపికలు భిన్నంగా ఉంటాయి. పెద్దలు కుదర్చిన వివాహాల్లో చాలా జంటలు ఎంతో సంతోషంగా, అన్యోన్యంగా ఉంటున్నారు. మరికొందరు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొన్ని సమయాల్లో మనమే ఎంపిక చేసుకున్న వ్యక్తికి విడాకులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇందులో ఏది తప్పు, ఏది కరెక్ట్ అనేది మనం చెప్పలేం' అని వేదాంత ధోరణిలో నిత్యామేనన్ పేర్కొన్నారు.

రూప కొడువాయూర్
స్టన్నింగ్ లుక్స్

సోషల్ మీడియాలో పిక్స్ వైరల్!

హైదరాబాద్, నవంబర్ 23 (సమయం న్యూస్): సహజసిద్ధమైన నటన, ఆకట్టుకునే హావభావాలతో గుర్తింపు పొందిన నటి రూప కొడువాయూర్, సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫొటోషూట్‌లు, వ్యక్తిగత విశేషాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. తాజాగా ఆమె పంచుకున్న స్టన్నింగ్ పిక్స్ నెట్టింట వేగంగా వైరల్ అవుతున్నాయి. ఆకర్షణీయమైన అవుట్‌ఫిట్, స్టైలిష్ లుక్స్‌తో రూప కొడువాయూర్ దిగిన ఈ ఫొటోలకు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ ఫొటోలపై నెటిజన్లు లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. సినిమా ప్రాజెక్టులతో పాటు సోషల్ మీడియాలోనూ చురుకుగా ఉంటూ ఫాలోవర్లను అలరిస్తున్నారు.





ఆయనే ప్రత్యేకతను గుర్తించారు

'భోగి' సినిమాలో మందారం పాత్రతో సరికొత్త అవతారంలో కనిపించబోతున్న డింపుల్ హయాతీ. ఇప్పటివరకు గ్లామర్ డాల్‌గా, డాన్సర్‌గా చూసిన ప్రేక్షకులు ఈసారి తనలోని కొత్త కోణాన్ని చూస్తారని ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.'ఇప్పటిదాకా నన్ను గ్లామర్ డాల్‌గా, డాన్సర్‌గా మాత్రమే తెరపై చూశారు. ఇప్పుడు నాలోని కొత్త యాంగిల్ బయటకు రాబోతుంది. మందారం పాత్రతో కొత్త డింపుల్‌ను చూస్తారు. ఈ క్రెడిట్ అంతా దర్శకుడికే దక్కుతుంది" అని డింపుల్ హయాతీ అన్నారు. శర్వానంద్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న 'భోగి' చిత్రంలో డింపుల్ హయాతీ మందారం పాత్రలో కనిపించనున్నారు. కె.కె. రాధామోహన్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహించారు. ఈ నెల 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డింపుల్ మాట్లాడుతూ 'తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని, నలుగురిలో ప్రత్యేకంగా నిలవాలని ప్రతి ఆర్టిస్ట్ కలలు కంటుంటారు. మన దగ్గరకు వచ్చిన అవకాశాల్లో ఏది చేయగలమో, ఏది మంచిదో అదే ఎంచుకుంటాం. అలా వచ్చిన అవకాశమే 'భోగి' చిత్రంలోని మందారం పాత్ర. రాధామోహన్ నిర్మించే మరో సినిమాలోని పాత్ర కోసం ఆయన్ను కలిశాను. ఆ సందర్భంలో సంపత్ నంది కలిసి ఈ కథ చెప్పారు. వేరే సినిమా చేయాల్సిన నేను మందారం పాత్ర చేస్తానని అడిగాను. అలా నాకు ఈ అవకాశం వచ్చింది. పాత్ర గురించి వినగానే ఇది నేనే చేయాలని నిర్ణయించుకున్నాను. నా కెరీర్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చే పాత్ర ఇది. ఇప్పటిదాకా నన్ను గ్లామర్ డాల్‌గా, డాన్సర్‌గా చూశారు. ఇవన్నీ పక్కనపెట్టి తొలిసారిగా ఓ దర్శకుడు నా కళ్లపై దృష్టిపెట్టి ఈ పాత్ర ఇచ్చారు. నాలోని మరో యాంగిల్‌ను ఆయన గుర్తించారు. మందారం పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతుందో తెరపై చూస్తేనే తెలుస్తుంది. ఈ సినిమా నాకు ప్రత్యేకమైన ఫ్యాన్‌బేస్‌ను క్రియేట్ చేస్తుంది. ఈ సినిమాలో మాటలు, తెలంగాణ యాస అన్నీ అద్భుతంగా కుదిరాయి. అయితే, ఈ సినిమాలో నాకు డాన్స్ చేసే అవకాశం దొరకలేదు. శర్వానంద్, అనుపమతో కలిసి పనిచేయడం బాగుంది. కచ్చితంగా ఈ సినిమా నా కెరీర్‌లో చాలా ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ క్రెడిట్ అంతా దర్శకుడికే చెందుతుంది' అని అన్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**